కులవినాశనవిధి కెత్తుకొన్నయావి
వేకుఁడింటుండఁ గోరెదు విడువ కెపుడు.

అహం—(భయముతో) అట్లయినపక్షమున దీనికిఁ బ్రతీకార మవశ్య మైనదే. ఎట్లనిన—

క. పురహరుఁడు హరుఁడు కరుణం
బరమపదజ్ఞానశూన్యమానవతతి కి
ప్పరి భవభయహర తారక
మురవుగ నవసానవేళ నుపదేశించున్.

దంభ—అది సత్యమే. అయినను గామక్రోధాద్యభిభూతుల కది లభింపదు. దానినిబట్టియే తైర్థికు లిట్లు చెప్పుచున్నారు—

క. విద్యా తపో యశస్సుల
హృద్యముగఁ గరంబు లంఘ్రు లెదయు నెవని క
య్యాద్యుని శివుఁ జేరునో యన
వద్యత నాతండె తీర్థఫలమును బొందున్.

[తెరలో]

ఓహో! జనులారా! ఇదె మహామోహమహారాజుగారు వచ్చుచున్నారు.

చ. స్ఫటికమణీవితర్దికలఁ జల్లుఁడు చందనగంధతోయముల్;
పటుగతి యంత్రమార్గములు పన్నుఁడు వారిగృహాంతరంబులన్;
స్ఫుటముగఁ గట్టుఁ డెల్లెడల భూరిలసన్మణితోరణావళుల్;
చిటుకున నింద్రచాపసమచిత్రపతాకల నెత్తుఁ డంతటన్.

దంభ—అయ్యా! మహారాజుగారు సమీపమునకువచ్చినారు. కాఁబట్టి మీరాయన కెదురుగాఁబోయి గౌరవింపవలయును,

అహం.—ఆలాగుననే చేయుదుము.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రవేశకము.

[అప్పుడు మహామోహమహారాజుగారు మహావైభవముతోఁ బరివారసహితముగాఁ బ్రవేశించుచున్నారు.]

మహామోహుఁడు.—(నవ్వి) ఓహో! మూఢులు నిరంకుశులు గదా!

చ. కలదఁట! యాత్మయొక్కటి జగంబున దేహముకంటె వేఱుగా?
ఫలమది మీఁదఁ గాంచునఁట! భద్రముగాఁ బరలోకమందహా!
వలవని యూడురాశియు నభస్తరురాజము పూచి స్వాదుస
త్ఫలముల నిచ్చునన్న భ్రమవంటిది కాదె తలంచి చూడఁగన్?

ఇటువంటి స్వకపోలకల్పనముచేత లేనిపదార్థము నొకదానిని నిర్మించి దుష్పాండిత్యము గలప్రబుద్ధు లీప్రపంచమును వంచించుచున్నారు.

శా. ఆహా! లేనిపదార్థ మున్నదని మిథ్యల్ పల్కు నయ్యాస్తిక
ద్రోహుల్ నాస్తికులంచు దూష్యులనుచున్ దూషింత్రు సత్యా
మాహాత్మ్యస్థితిఁ బంచభూతపరిణామంబౌచు జైతన్యసం[ధ్యులన్
దోహం; బెవ్వరు దేహభిన్నునిఁగ నెందుం జూచిరే జీవునిన్?

వీరు తమ్ముమాత్రమే కాక లోకమునంతను వంచించుచున్నారు.

మ. తనువుల్ వక్త్రముఖాంగసంచయముచేతన్ దుల్యముల్ గాఁగ, వే
అన నేలా కులముల్? పరాంగన యిదన్యార్థం బిదన్ భేదముల్
గనరా వింతయు నాకు! హింసఁ బరకాంతాస్వాపతే యాక్రమం
బున దోషంబని కల్పనల్ సలిపిరింపుల్ వుట్ట నిష్పౌరుషుల్.

(ఆలోచించి శ్లాఘనతో) ప్రత్యక్షమే ప్రమాణమగుటనుబట్టిసర్వవిధ ములచేతను లోకాయతశాస్త్రమే శాస్త్రము. "పృథివ్యాపస్తేజో వాయువులు తత్వములు; అర్థకామములు పురుషార్థములు; భూతములే జ్ఞానజనకములు; పరలోకము లేదు; మృత్యువే మోక్షము" అని యీ శాస్త్రము నస్మదీయాభిప్రాయానుసారముగా వాచస్పతి రచియించి చార్వాకునికి సమర్పించెను. అతఁడు శిష్యోపశిష్యమార్గమున దానిని లోకమున వ్యాపింపఁజేసెను.

[అంతటఁ జార్వాకుఁడును శిష్యుఁడును బ్రవేశించు చున్నారు.]

చార్వా—వత్సా! నీవెఱుఁగుదువు దండనీతియే విద్య; దానిలో నంతర్భూతమయిన దేవార్త. త్రివేదములును ధూర్తప్రలాపములు చూడుము—

గీ. యజ్వలకు ద్రవ్యనాశక్రియాదికంబు
వలన స్వర్గఫలంబది వచ్చునేని,
ధరణిలో దావవహ్నిదగ్ధంబులైన
పాదపంబులవలనను ఫలము లొదవు.

మఱియును,

గీ. పుడమిలో యజ్ఞమునఁ జంపఁబడెడునట్టి
పశువునకు స్వర్గసౌఖ్యంబు వచ్చునేని,
యజ్ఞపశువునుగాఁ జేసి యజ్ఞకర్త
స్వర్గసుఖమందఁ దనతండ్రిఁ బనుపరాదె?

క. మరణము నొందిననరులకుఁ
గరమును శ్రాద్ధంబు తృప్తిఁ గలిగించెడుచో,
ధర నాఱిన దీపంబున
కురుకాంతిని దైలదాన ముత్పాదించున్.

శిష్యు—ఆచార్యా! ఈప్రకారముగాఁ బురుషులకుఁ దినుటయుఁ ద్రాగుటయు నే పరమార్థములయినపక్షమున, ఈ త్రైవర్ణికులు సంసారసుఖమును విడిచి యేల తాము ఘోరతరములయిన పారాక సాంతపనషష్ఠకాలాదు లగుదుఃఖములచేత శ్రమ పడుచున్నారు?

చార్వా—వంచకప్రణీతములయిన యాగములచే మోసపోయిన యీమూర్ఖుల కాశామోదకములచేత నే యిట్టితృప్తికలుగు చున్నది. చూడు—

గీ. భుజనిపీడితఘనబాహుమూలభుగ్న
కుచయుగాభోగకాంతోపగూహ మేడ?
భ్రష్టబుద్ధులభిక్షోపవాసనియమ
సూర్యకరతాపమున దేహశోష మేడ?

శిష్యు—ఆచార్యా ! దుఃఖమిశ్రితమయిన సంసారసుఖము పరిహసింపఁ దగనిదని యీవిధముగాఁ దైర్థికులు చెప్పుచురుగదా?

చార్వా—(నవ్వి) ఇది యీనరపశువులయొక్క దుర్బుద్ధివిల సనము.

చ. అవనిని దుఃఖమిశ్రితములౌటను నింద్రియజన్యసౌఖ్యముల్
తివిరి త్యజింపఁబోలు ననుధీరులు మూర్ఖులె కాతలంపఁగన్
జవిగలతెల్లబియ్యమున సారతరంబగుశాలిధాన్యమున్
దవులఁ ద్యజించునే యుముకఁ దాల్చునటంచు వివేకియెవ్వఁడున్

మహామోహు—ఓహో! చిరకాలమునకుఁ బ్రామాణికములయిన వచనములు కర్ణసుఖమును గలిగించుచున్నవిగదా! (చూచి యానందముతో) ఇతఁడు నాప్రియసఖుఁడయిన చార్వాకుఁడా?

చార్వా—(చూచి) ఇతఁడుమహామోహమహారాజు. (సమీప

మునకుఁబోయి) జయముగుఁగాక! జయముగుఁగాక! ఓమహారాజా! ఇదిగో చార్వాకుఁడు ప్రణామము చేయుచున్నాఁడు.

మహా—చార్వాకా! నీకు స్వాగతము. ఇక్కడఁ గూరుచుండుము.

చార్వా—(కూరుచుండి) ఇది కలియొక్క సాష్టాంగ ప్రణామము.

మహా—అచ్చటఁ గలి కవ్యాహతకుశలమా?

చార్వా—దేవరవారి ప్రసాదమువలన సర్వత్ర కుశలమే. అతఁడు కార్యశేషమును గూడఁ దీర్చి మఱి దేవరపాదములనుసందర్శింపఁగోరుచున్నాఁడు.

చ. ఎవఁడు, మహత్తరంబయిన యేలికయాజ్ఞనుబూని దాని శా
  స్త్రవహనసంబున న్నిలిపి, తత్క్షణలబ్ధసుఖ ప్రసాదుఁడై,
  యవిరళహర్షపూర్ణహృదయంబున దర్శనమిచ్చుస్వామిపా
  దవనజవందనం బిడు, నతం డతిధన్యుఁడు భృత్యకోటిలోన్.

మహా—ఇప్పుడాకలి యేమేమి చేసియున్నాఁడు?

చార్వా—దేవా! చిత్తగింపుము—

చ. శ్రుతివిహితార్థమార్గములచొప్పు తొలంగి మహాజనుల్ యథే
  ష్టతఁ జరియించువారయిరి జంకును గొంకు నొకింత లేక; యీ
  గతికిని హేతు వాకలియుఁగాఁడు, మదీయబలంబుఁ గాదు, వి
  శ్రుతముగఁ బౌరుషంబుఁ బెనుచుం బ్రభుసన్నయే భటాళికిన్.

అక్కడ నుత్తరపథికులును పాశ్చాత్యులును వేదములనే త్యజించినప్పుడిఁక శమదమాదులకథ యేల? ఇతరస్థలములయందు సహితము వేదములు తెలుచుగా జీవికామాత్రఫలములే యైనవి.

గీ. అగ్నిహోత్రంబు, వేదత్రయంబు, మఱి త్రి
దండమును, దేహమున భస్మధారణంబుఁ,
బ్రజ్ఞయును బౌరుషము లేనిపందలకును
జీవిక లని బృహస్పతి చెప్పె మున్ను.

కాఁబట్టి కురుక్షేత్రాదులయందు విద్యా ప్రబోధచంద్రోదయ మగునని దేవరవారు స్వప్నావస్థయందును శంకింపవలయు.

మహా—చక్కగా సాధించినారు. ఆతీర్థమును వ్యర్థమయిన దానినిగాఁ జేయుట గొప్పపనికదా?

చార్వా—దేవా! దేవరవారికి విన్నవింపవలసినది మఱియొకటియున్నది.

మహా—అది యేది?

చార్వా—విష్ణుభక్తియను పేరుగల మహానుభావురాలయిన యోగిని యొకతెయున్నది. ఆమె సర్వత్ర సంచారము చేయుకుండఁగలిచేత నిలువఁబడిన దయ్యెను, తదనుగ్రహీతులయినవారిని దేఱి చూచుటకును మేము శక్తులము కాకున్నాము. కాఁబట్టి దానికిఁ బ్రతీకారమును దేవరవారే సావధానముగా నాలోచింపవలయును.

మహా—(భయముతోఁ దనలో) అక్కటా ప్రసిద్ధమహాప్రభావ యైన యాయోగిని మాకు స్వభావవిద్వేషిణి; దుస్సాధ్యురాలు. కానిమ్ము. (ప్రకాశముగా) ఓయీ! మనకీశంకతోఁ బనిలేదు. కామక్రోధాదులగు శత్రువులముండఱ దానిపని యెక్కడసాగును?

చార్వా—అల్లయ్యును శత్రుఁడల్పుఁడని జిగీషుఁడైనవాఁ డేమఱియుండఁగూడదు.

క. అరి యల్పుఁడ య్యు, మర్మము
లరసి మహాబాధఁ దెచ్చు నవనీశునకున్;

గర మల్ప మయ్యె, నుల్లది
చగణమున కపారమైన శ్రమ మొనరించున్.

మహా—(తెరవంకఁ జూచి) ఓరీ ఎవఁ డక్కడ?

[దౌవారికుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దౌవా—స్వామీ? ఏమియాజ్ఞ?

మహా—ఓరీ! అసత్సంగా! "ఏమఱియుండక యోగినియైన విష్ణుభక్తిని మీరే హతము చేయవలెను" అని కామక్రోధమదమాన మాత్సర్యాదులతో నేనాజ్ఞాపించినట్లు చెప్పుము.

దౌవా—దేవర సెలవిచ్చినట్లు చేసెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

[అప్పుడు పత్రిహస్తుఁడై యొకపురుషుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

పురు—(తనలో) సముద్రతీరమునందలి పురుషోత్తమసంజ్ఞ గల దేవాలయమునందున్న మదమాన నామధేయులగు ప్రభువులు మహారాజసన్నిధానమునకుఁ బంపఁగా నేనిప్పు డుత్కలదేశమునుండి వచ్చినాఁడను. (చూచి) ఇదివారణాసి; ఇదిరాజమందిరము. ఇంకుఁ బ్రవేశించెదను. (ప్రవేశించి) ఈప్రభువువారు చార్వాకునితో నేదో మంత్రాలోచన చేయుచుఁ గూరుచున్నారు. వీరిసమీపమునకుఁ బోయెదను. (సమీపమునకుఁబోయి ప్రకాశముగా) దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక! తమకుఁ బంపఁబడిన యీపత్రికను దేవరవారు చిత్తగింపవలయును.

మహా—(పత్రికపుచ్చుకొని) నీ వెక్కడనుండి వచ్చినావు?

పురు—పురుషోత్తమాలయమునుండి వచ్చినాఁడను.

మహా—(తనలో) ఇది యేదో ప్రాణాంతక మయినకార్యము యుండును. (ప్రకాశముగా) చార్వాకా! ఇప్పుడు నీవు పొమ్ము

కర్తవ్యమునందు నీవవహితుఁడవయి యుండవలెను.

చార్వా—దేవరవారాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

మహా—(పత్రికను జదువుచున్నాఁడు)—"స్వస్తి! శ్రీవారణాసీపురవరాధీశ్వరులైనమహారాజాధిరాజ రాజపరమేశ్వర మహామోహ మహారాజులవారి పాదపద్మములకు శ్రీపురుషోత్తమాలయము నుండి మదమానులు సాష్టాంగప్రణామములు చేసి చేయఁగల విన్నపము. ఇక్కడ మేము నిరంతరక్షేమముతో నున్నాము. తరువాత శాంతి దేవి తనతల్లియైనశ్రద్ధతోఁగూడ వివేకునిదౌత్యమును బూని యుపనిషద్దేవిని వివేకునితోడి సంగమమునకు అహర్నిశమును బ్రబోధించుచున్నది. మఱియు ధర్ముఁడు కామసహచరుఁడయ్యును వైరాగ్యాదులచేత వేఱుపఱుపఁబడినవానివలెఁగానఁబడుచున్నాఁడు. అందుచేత నతఁడు కామునినుండి విడిపోయియొకానొకప్పుడుని గూఢముగాఁ దిరుగుచున్నాఁడు. కాఁబట్టి యీసంగతిని దేవర దివ్యచిత్తమునకుఁ దేవలెను"—(క్రోధముతో) ఆహా! ఏమిది? ఈయుత్తముగ్గులు శాంతికిసహితము భయపడుచున్నారు! ఈశాంతి యెక్కడనుండి పుట్టినది?

చ. అజుఁ డగు సృష్టిమాత్రనిరతాత్ముఁడు; దక్షముఖాంతకుండు శై
లజనిబిడోపగూహనమునన్ సుఖియించు విఘూర్ణితాత్ముఁడై;
బుజవుగ శ్రీకపోలమకరీకళలాంఛితవక్షుఁడై యధో
క్షజుఁడు వసించు సంబుధి; నిఁకన్ బెఱవారికి శాంతి యబ్బునే?

(పురుషునిగూర్చి) ఓజాల్మా! నీవు సత్వరముగాఁ గాముని యొద్దకుఁబోయి, "ధర్ముఁడు దురాత్ముఁడని మేమిప్పుడు దెలిసికొన్నారము. అతఁడు ముహూర్తకాలమయినను నమ్మఁదగినవాఁడు కాఁడు.

కాఁబట్టి నీ వాతని దృఢముగా బంధించి కట్టివేయుము" అని మా
యాజ్ఞను జెప్పుము.

పుర—దేవర సెలవిచ్చినట్లు జేసెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

మహా—(ఆలోచించి తనలో) శాంతిని సాధించుట కేమియు పాయ మున్నది? ఉపాయాంతరములోఁ బనిలేదు. ఈపని కిక్కడ క్రోధలోభులే సమర్థులు. (ప్రకాశముగా) ఎవ రక్కడ?

దౌవా—(ప్రవేశించి) దేవా! ఏమియాజ్ఞ?

మహా—ఇప్పుడే క్రోధునిని లోభునిని బిలుచుకొని రా.

దౌవా—దేవర సెలవిచ్చినట్లు చేసెదను.

[అంతట క్రోధుఁడును లోభుఁడును బ్రవేశించు చున్నారు.]

క్రోధు—శాంతి శ్రద్ధా విష్ణుభక్తులు మహారాజుగారితో వైరమును వహించినారని విన్నాఁడను. నేను జీవించి యుండఁగానే తమప్రాణములమీఁదికి వచ్చెడి యీపని యేల?

ఉ. చేయుదు లోక మంధముగఁ; జేయుదు ధీరుల శ్రోత్రహీనులన్;
జేయుదుఁ జేతనంబుల నచేతనరీతిని; నాదుశక్తిచే
నేమెడఁ గృత్యముల్ గన రొకింత, హితంబు వినంగఁజాల, రా
మ్నాయము లభ్యసించి మతిమంతులు తాము స్మరింపరర్థమున్.

లోభు—ఓయీ! సన్నాశ్రయించువారు మనోరథనదీపరంపరలనే తరింపఁ జాలరు. అట్టివారు శాంత్యాదుల నెట్లు చింతింపఁ గలుగుదురు? మిత్రుఁడా! చూడు—

చ. మదజలసిక్తగండగజమండలియున్, ఘనవాయువేగమున్
గొదవయొనర్చు పర్వఁగలగుఱ్ఱములున్, గల వెన్నొ మాకు, సం

పద యిది చాలదంచు, మఱివచ్చిన నింకను నింకఁ గోరుచుం
బొదలుచురాశ హృద్భ్రమముఁ బొందెడువారికి శాంతిగల్గునే!

క్రోధు—ఓ మిత్రుఁడా! నాప్రభావము నీకుఁ దెలియునుగదా!

చ. చదిపెను వృత్రుఁ ద్వష్టసుతు శక్రుఁడు; ద్రుంచె విరించిమూర్ధమున్
మదనవిరోధి; కౌశికుఁడు నామ మడంచె వసిష్ఠపుత్రులన్;
మదసమశక్తి పండితుల మాన్యయశస్కుల సచ్చరిత్రులన్
సదమలపౌరుషాఢ్యుల వెసం గులనాశ మొనర్చు వ్రేల్మిడిన్.

లోభు—ప్రియులారా! తృష్ణా! ఇటు రమ్ము.

[తృష్ణాదేవి ప్రవేశించు చున్నది.]

తృష్ణ—ప్రాణేశ్వరా! ఏమి యాజ్ఞ!

లోభు—ఓ ప్రియురాలా! వినుము.

చ. పొలమును గ్రామముల్ వనముభూధ్రముఁ బట్టణముం బురంబుదీ
వులు మహిమండలం బనెకుప్రోత్థితవాంఛితసూత్రబద్ధబు
ద్ధుల కతికాంక్ష నంగములు, తోరముగాఁగ భవత్ప్రసన్నతన్
బలిసినఁ, బుట్టునే శమము ప్రాణులయాశ కజాండలక్షలన్.

తృష్ణ—ఓప్రాణనాయకా! స్వయముగానే నిత్యమును నే నీపనియం దభియుక్తురాలనయి యున్నదానను. అందుమీఁద నిప్పుడు తమయాజ్ఞచేత బ్రహ్మాండకోటులచేతనైనను నాయుదరము నిండదు.

క్రోధు—ఓహింసా! ప్రియురాలా ఇటు రమ్ము.

[హింసాదేవి ప్రవేశించు చున్నది.]

హింస—ఇదిగో వచ్చినదానను. భర్తగారి సెల వేమి?

క్రోధు—ప్రియురాలా! నీవు సహధర్మచారిణి వగుటచేత నాకుఁ బితృవధసహితము సుకర మయినది. నాకు—

ఉ. ఎంత పిశాచి మాత! పిత యెంత! సహోదరు లెంత కీటముల్!
వంతుగ సర్వబంధువులు వధ్యులు వక్రవిటాభ సౌహృదుల్;
(చేతులు పిసికికొనుచు)
శాంతిని బొంద వీరియెడల సంతతకోపశిఖిస్ఫులింగముల్,
సంతతితోడఁ బూర్ణముగ జ్ఞాతికులంబు నడంచునంతకున్.
(చూచి) వీరె మనప్రభువువారు. వారిదర్శనము చేసికొందము.

అందఱు—(సమీపమునకుఁబోయి) దేవా! జయమగుఁగాక!

మహా—మాకు శత్రురా లయిన శ్రద్ధకూతును శాంతిని మీరు నిగ్రహింపవలెను.

అంద—దేవరయాజ్ఞాప్రకారము చేసెదము.

(అని నిష్క్రమించుచున్నారు)

మహా—శ్రద్ధకూఁతురని పలుకుటచేత నామనస్సున కొక్కయుపాయాంతరముసహితము పొడకట్టుచున్నది. శాంతి తనతల్లియైన శ్రద్ధకుఁ బరతంత్రురాలు. కాఁబట్టి యిప్పుడు మన మేఁగుపాయము చేతనైనను శ్రద్ధ నుపనిషద్దేవిసమీపమునుండి యాకర్షించి బంధించి వేయవలెను. అప్పుడందువలన మాతృవియోగదుఃఖముచేత నత్యంత మృదుస్వభావ యయిన శాంతి బలముడిగినదయి కృశించి నశించును. శ్రద్ధ నాకర్షించి యెడఁబాటు చేయుటకు నాస్తికతావిలాపిని యే పరమసమర్థురాలు. కాఁబట్టి యామెనే యీపనికి నియోగింపవలెను. (ప్రక్కనుజూచి) విభ్రమావతీ! నీవుసత్వరముగా నాస్తికతాదేవిని బిలుచుకొనిరా.

విభ్ర—ఏలినవారి సెలవుప్రకారము చేసెదను. (అని నిష్క్రమించి నాస్తికతాసహితయై మరలఁ బ్రవేశించుచున్నది)

నాస్తి—సఖీ! చిరకాలమునుండి చూడకున్న మహారాజ

ముఖమును నేనిప్పు డెట్లుచూతును? అతఁడు నన్నెగ్గులాడునేమో!

విభ్ర—సఖీ! నీముఖదర్శనముచేత మహారాజు తనదేహమే తా నెఱుఁగకుండును. అట్టిస్థితిలో నిన్నెగ్గులాడఁ గలుగును?

నాస్తి—సఖీ! నామిథ్యాసౌభాగ్యము నెంచి పరిహసించుచున్నావా?

విభ్ర—సఖీ! నీ సౌభాగ్యముయొక్క మిథ్యాత్వమును నీ విప్పుడే తెలిసికోఁగలవు. సఖీ! నీకన్నులు నిద్రచాలక కలతనొందినట్లు కానఁబడుచున్నవి. ఇట్లు నాప్రియసఖ నేత్రములకు నిద్రతక్కువగుటకుఁ గారణమేమో?

నాస్తి—సఖీ! ఏకవల్లభయైన స్త్రీకిసహితము నిద్ర దుర్లభమగుచుండఁగా, బహువల్లభనైన నాకెట్లుండును?

విభ్ర—నాప్రియసఖికి వల్లభు లెవ రెవరో?

నాస్తి—ఈ మహారాజొకఁడు, అపయుని గామక్రోధలోభాహంకారులు, అతివిస్తారము చెప్పఁబనిలేదు. ఈవంశమునందుఁబుట్టిన పురుషుఁడు పసివాఁడైనను ముసలివాఁడయినను బతుకువాఁడయినను రాత్రిందివము లొక్కఁడును హృదయనివాసినినైన నన్నువిడిచియుండఁడు.

విభ్ర—సఖీ! కామునకు రతియు, క్రోధునకు హింసయు, లోభునకుఁ దృష్ణయు, పరమప్రియురాండ్రని విందుము. తమ ప్రియతములతో నిత్యమును రమించుచుండెడు నీపయుని వారి కీర్ష్య యెట్లు కలుగకున్నది?

నాస్తి—సఖీ! ఈర్ష యుని యేలపలికెదవు? వారుసహితము నన్ను విడిచి ముహూర్తకాల మయినను నిలువలేరు.

విభ్ర—సఖీ! నీసౌభాగ్యమువలన మనోవ్యాకులత నొంద

వలసిన సవతులు సహితము నీయనుగ్రహమును గోరుచుండుటచేత నే భూమిమీఁద నీవంటిసౌభాగ్యవతి లేదని చెప్పుచున్నారు. సఖీ! ఇంకొకమాట చెప్పెదను. ఈవిధముగా నీవు నిద్రాకులహృదయవయి తొట్రిలుకాళ్ళనుండి యందియలుజాతి గళ్ళుగళ్లుమని మ్రోగఁగా నడచుచు మహారాజును గౌరవించినప్పు డతఁడు మనస్సులో శంకపడునేమోయని నే నూహించెదను.

నాస్తి—ఇక్కడ శంకింపవలసినదని యేమున్నది? మహారాజుగారి నియోగానుసారముగానే నేనీవేషమును ధరించితిని. సఖీ! అంతేకాక దర్శనమాత్రముననే ప్రసన్నులగు పురుషులకు భయపడనేల?

మహా—(చూచి) ఇదిగో నాప్రియురాలు నాస్తికత సమీపించినది!

చ. నడలు నితంబగౌరవమునన్ జడనొందఁగఁ గొప్పుపూసరం
బెసఁగఁగఁ జెర్వ నేడ్కఁ గరమెత్త సరోజనఖాంకముల్ బయ
ల్పడఁ, గడునల్లగల్వసరుల న్నగుచూపు లెదం గలంపఁగా,
నడవఁగ నూఁగుకంకణఝుణత్కృతితో నిదె కాంత వచ్చెడున్.

విభ్ర—అదిగో మహారాజు ప్రియసఖీ! ఆయన సన్నిధానమునకుఁ బొమ్ము.

నాస్తి—(దగ్గఱకుఁబోయి) మహారాజా! జయమగుఁగాక! జయమగుఁగాక!

మహా—ఓప్రియురాలా!

క. అంకమునఁ జేరి, ప్రకటన
ఖాంక స్తనముల నొసంగు మాలింగనముల్
శంకరునొడిలో నుండిన
శాంకరిశోభావిలాససంపదఁ గనుచున్.

నాస్తి—(చిఱునవ్వుతోఁ గౌఁగిలించుకొనుచున్నది)

మహా—(ఆలింగనసుఖము నభినయించి) ఓహో! ఈమె కౌఁగిట నాదరించుటవలన నాకిప్పుడు మరల నవయౌవనము కలుగుచున్నది. ఓవిలాసినీ!

ఉ. నాదువయోనువిభ్రమములన్ మును పెప్పుడొ కల్గి, మానసో
న్మాద మొనర్చి, యింద్రియకదంబసుఖైకరసాత్మఁ జేసి, ప్రే
మాదరములఁ బెనంచినయనంగవికారము నేఁడు నీవు నన్
గాఢిలిఁ గౌఁగిలించుటను గ్రమ్మఱఁ బుట్టె, మదాత్మ నిచ్చెదున్.

నాస్తి—ఓమహారాజా! నేనిప్పుడు నవయౌవనదశలోనున్నను, నామనస్సులో నాటియున్న నీమీఁదిప్రేమము కాలము గడుచుటచేత సహితము పోలేదు సుమా! ఏనిమిత్తముచేత దేవరవారు నన్నుఁ దలంచితిరో సెలవిండు.

మహా—ప్రియురాలా!

క. పడతీ! తలఁపఁగఁ జను మది
కెడముగ నున్నట్టివారి నెందైనను నీ
వెడఁబాయకుండు మెప్పుడు
చెడ కస్మచ్ఛత్రభిత్తిచిత్రము పోలెన్.

నాస్తి—నాకిది మహాప్రసాదము. ఓమహారాజా! నాపని యేమో యాజ్ఞాపింపుఁడు.

మహా—ఈప్రకారముగాఁ బ్రకాశితములైన యంగములతో నీవు సర్వత్ర సంచరింపవలయును. ఇదిగాక తొత్తుకూఁతురు శ్రద్ధాకాంత వివేకునితో నుపనిషద్దేవిని గూర్చుటకయి దూతికాభావమును వహించినది.

గీ. మనసుఁ బ్రతికూల; పాపుల మైత్రిఁ దిరుగు;
నకులజ; కరంబుఁ బాపాత్మురాలు శ్రద్ధ;
యిపుడె తలపట్టి యీ రండ నీడ్చి తెచ్చి
కినుకఁ బాషండులకు నొప్పగింపు మీవు.

నాస్తి—ఇంతమాత్రపుఁబనికిఁ బ్రభువువారికి శ్రమ యక్కఱ లేదు. వచనమాత్రముచేతనే దేవరివారిసేవకురా లగు శ్రద్ధ తమ యాజ్ఞను జెల్లించును. "ధర్మము మిథ్య; మోక్షము మిథ్య; వేదమార్గము మిథ్య; సుఖభంగకరము లయినశాస్త్రప్రలాపములు మిథ్యలు; స్వర్గఫలవిద్య మిథ్య" అని నాచేత బోధింపఁబడి యామె శీఘ్రకాలములో వేదమార్గమునె పరిహరింపఁగలదు. ఇఁక నుపనిషత్తుమాట చెప్పనేటికి! అంతే కాక విషయానందవిముక్తమని మోక్షవిషయమున దోషములు చూపి యచిరకాలములోనే శ్రద్ధను నే నుపనిషత్తు నుండి విరక్తమగునట్లు చేసెదను.

మహా—ఇదియంతయు నిట్లు చక్కఁబడినపక్షమునఁ బ్రియురాలు నాకు గొప్పప్రియము చేసినదగును (అని మరల నాలింగనము చేసి ముద్దు పెట్టుకొనుచున్నాఁడు.

నాస్తి—అయ్యో! భర్తగారిట్లు బహిరంగముగాఁ బ్రవర్తించుటచేత నేను సిగ్గుపడుచున్నాను.

మహా—కానిమ్ము. మనము నివాసగృహమునకే పోవుదము రమ్ము.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

తృతీయాంకము

[అప్పుడు శాంతిదేవి కరుణతోడఁగూడఁ బ్రవేశించుచున్నది.]

శాంతి—(కన్నీరు విడుచుచు) హా! మాతా! శ్రద్ధా! నీవెక్కడ నున్నావు? నాకొక్కసారి నీప్రియదర్శనమిమ్ము.

మ. మృగముల్ భీతిఁదాఁగియుండువనులన్, హృద్యస్రవంతీలస
న్నగరాజంబుల, దేవతాగృహములన్, సన్మౌనిసద్మంబులన్,
జగతి న్వాసముచేయునీ వెటు లికన్, చండాలవేశ్మస్థమై
వగలంబొందెడుగోవుమాడ్కి, మనెదే పాషండగేహంబులన్?

నాకామె జీవముతో నున్నదని యాశ లేదు.

క. ననుఁజూడక తా స్నానం
బొనరింపదు కూడుకుడువ దుదకము త్రాగన్
జన దట్టిశ్రద్ధ కటకట!
మనియుండదు నన్నుఁబాసి మహి నిమిషంబున్.

అందుచేత శ్రద్ధలేక శాంతియొక్క జీవనము ముహూర్తకాలమయినను నిరర్థక మయినదే యగును. కాఁబట్టి, ఓసఖీ! కరుణా! నీవు నానిమిత్తమయి సౌదపేర్పుము. అగ్నిహోత్ర ప్రవేశముచేత నేనచిరకాలములోనే యామె సహచరినయ్యెదను.

కరుణ—(కన్నీటితో) ఓసఖీ! భయంకరాగ్నిజ్వాలలవంటికర్ణకఠోరములయిన దుస్సహవాక్యములు పలుకుచు సర్వవిధములచేతను నాప్రాణములు పోవునట్లు చేయుచున్నావు. ఓప్రియసఖీ! కొంతశాంతతవహించి ముహూర్తకాలము జీవము నిలుపుకొమ్ము. ఇంతలో నేనక్కడ మునిజనసమాకులములయిన పుణ్యాశ్రమములయందును భాగీరథీతీరములయందును నిపుణముగా వెదకెదను. ఒకవేళ

మహామోహునివలని భీతిచేతఁ బ్రచ్ఛన్నయయి యామె యెక్కడ నైన దాఁగియుండును.

శాంతి—సఖీ! నీవేల వెదకెదవు?

శా. నీవారాంకితసైకతంబులు, స్రవంతీవ్రాతకూలంబులున్,
శ్రీవైఖానసవాసముల్, చమసబర్హిర్వ్యాప్త యజ్ఞస్థలుల్,
నే వీక్షించితి; నాలుగాశ్రమములన్ వేర్వేర శోధించితిన్;
దేవిన్ శ్రద్ధనుగాన నెందును; వినన్ లేదెందుఁ దన్నామమున్.

కరు—సఖీ! నేను జెప్పెడిదానిని వినుము. ఆ శ్రద్ధాదేవి సాత్త్వికురాలే యయినపక్షమున, ఆమె కెటువంటిదుర్గతి పట్టునని నేను భావింపను. ఆమెవంటిపుణ్యాత్మురాండ్రిటువంటిసంభావింపఁదగని విపత్తు ననుభవింపు వారు కారుగదా?

శాంతి—ఓచెలీ! విధి ప్రతికూలుఁడయినప్పుడేది సంభావింపదగని దగును?

మ. జనకేంద్రాత్మజ యాదశాస్యుకడ సాపాల్లక్ష్మి మున్నుండదే!
దనుజుల్ తొల్లి యిడంగలేదె బలిసద్మంబందు వేదత్రయిన్!
ఘనగాంధర్వి మదాలసం గొనఁడె మున్ బాతాళకేతుండు నాఁ
జనుదైత్యేంద్రుఁడును మోసపుచ్చి? విధిచేష్టల్ తద్దయున్ విక్రముల్

కానిమ్మా. మనమిప్పుడు పాషండగృహములనే యనుసరించిపోదము.

కరు—సఖీ! అలాగుననే చేయుదము.

ఇద్దఱు—(నడుచుచున్నారు.)

కరు—(భయముతో) సఖీ! రాక్షసుఁడు.

శాంతి—ఏఁడీ రాక్షసుఁడు?

కరు—సఖీ! చూడుము. కాఱుచున్నమలపంకముచేత దట్టము యిరోఁతపుట్టించుచున్న చూడఁసహ్యముగాని శరీరముతోను, ఉత్పాటి

తములైన కేశములతోను, దిసమొల యగుటచేఁ జూడఁగూడని రూపముతోను, చేత నొక నెమలిపింఛము పట్టుకొని వాఁ డీవంక నే వచ్చుచున్నాఁడు.

శాంతి—సఖీ! వీఁడు రాక్షసుఁడుగాఁడు. మిక్కిలిబలహీనుఁ డుగా నున్నాఁడు.

కరు—వీఁడెవఁడయి యుండును?

శాంతి—సఖీ! పిశాచమని శంకించెదను.

కరు—దేదీప్యమానమైన కిరణసముదాయముతో మార్తాండ మండల మాకాశమధ్యమునఁ బ్రచండముగా వెలుఁగుచుండఁగా బిశాచముల కవకాశ మెట్లు కలుగును?

శాంతి—అట్లయినయెడలనీతఁడిప్పుడేనరకబిలమునుండి వెడలి వచ్చిన యెవ్వఁడో నరకలోకవాసి యయియుండును. (చూచియాలో చించి) ఆహా! ఇప్పుడు తెలిసినది. వీఁడు మహామోహునిచేతఁ బంపఁ బడిన దిగంబరసిద్ధాంతుఁడు. కాఁబట్టి వీనిరూపమును సర్వవిధముల చేతను దూరమునందే సంహరింపవలయును. (అనిమోముత్రిప్పుకొని నిలుచున్నది.)

కరు—సఖీ! ముహూర్తమాత్రము నిలువుము. ఇక్కడిక్కడ నేను శ్రద్ధను వెదకెదను.

[అట్లిద్దఱును నిలువఁబడి యుండఁగా వెనుకఁజెప్పినరీతిని దిగంబర సిద్ధాంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దిగంబర—నమోర్హ ద్భ్యోనమోర్హ ద్భ్యః.

గీ. మహి నవద్వారయుతగృహమధ్యమందుఁ
బ్రజ్వలించును దీపంబుపగిది నాత్మ;

యీ జినవరసుభాషితమె పరమార్థ
మధికతరమోక్షసౌఖ్యదాయకము సుమ్మీ.

(అని కొంచెము నడచుచున్నాఁడు.)

(ఆకాశమునందు) ఓశ్రావకులారా! వినుండు.

క. మలమయశరీరపిండము
కలజములనెల్లఁ గడుగఁ గాంచునె శుద్ధిన్?
దెలియఁగఁదగు ఋషిసేవా
ఫలమున నాత్మ విమలస్వభావం బనుచున్.

ఏమనుచున్నారు? ఋషిపరిచర్య యెట్టిదనుచున్నారా? చెప్పెదను వినుండి.

క. కని శాళ్యకెరఁగి దవులన్,
దనుపఁగఁదగు నిష్టభోజనంబుల వారిన్;
. చన దీర్ఘ్యామల మొందఁగ
ఘను లాఋషివరులు తమదు కాంతలఁ బొందన్.

(తెరవంకఁజూచి) ఓశ్రద్ధా! ఇటురమ్ము.

శాంతియు, గరుణయు—భయముతోఁ జూచుచున్నారు)

[అప్పుడు తదనురూపవేషముతో శ్రద్ధ ప్రవేశించుచున్నది]

శ్రి—ఓరాజబాంధవా! ఏమి సెలవు?

శాంతి—(మూర్ఛపోవుచున్నది)

దిగంబ—శ్రావకసముదాయమును నీ వొక్కముహూర్తమయినను విడిచి యుండఁగూడదు.

శ్రద్ధ—దేవర వారాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని నిష్క్రమించుచున్నది)

కరుణ—ఓప్రియసఖీ! ఊరడిల్లుము. నామమాత్రముచేత నే

సీవిట్లు భయపడఁగూడదు. పాషండులయొద్ద సహితము తమస్సుయొక్క కూఁతు రైనశ్రద్ధ యొక్కతె యున్న దని యుహింసవలన నేను మున్ను విన్నదానను. కాఁబట్టి యిది యా తామసీ శ్రద్ధయయి యుండును.

శాంతి—(ఊఁఅడిల్లి! సఖీ! అవును. ఇది యదే. ఎట్లన—

క. భూరిదురాచార సదా
చారనుగాఁగను, గురూప సద్రూపనుగా,
నూరక భ్రమపని దీర్ఘ
గూరిమిజననిఁగ దురాశఁగొంటిని జుమ్మీ.

కానిమ్ము మనమిప్పుడు బౌద్ధులకడనే శ్రద్ధను వెదకుదము.

(అని శాంతికరుణలు ముందునకు నడుచు చున్నారు.)

[అప్పుడు పుస్తకహస్తుఁడయి బుద్ధాగముఁడు, భిక్షురూపమునఁ బ్రవేశించుచున్నాఁడు]

బుద్ధా—(ఆలోచించి) ఓయుపాసకులారా!

ఉ. ఇప్పుడు వాసవాసమితి యేమియు నంటమి, ధీపరంపరల్
తప్పక వెల్గెడుర్ విషయతత్త్వానురాగవివర్జితంబులై;
యప్పటిబుద్ధికల్పితము లయ్యును బాహ్యములట్ల తోఁచుఁగ
న్గప్పి నిరాత్మకంబులు క్షణక్షయశీలము లౌపదార్థముల్.

(కొంచెము నడచి మరలశ్లాఘనపూర్వకముగా) ఓహో! భోగమును మోక్షమును జేరియున్న యీ బౌద్ధధర్మ మెంతమేలయినది!

చ. చెలువగుమందిరంబుల వసింపఁగవచ్చు విలాసినీతతిన్
గలయఁగవచ్చు; భోజన మొనర్పఁగవచ్చు నభీష్టవేళలన్;
దెలిమ్మగుశయ్యలందు శయనింపగవచ్చుఁ: గృతాంగరాగలై
వలచుప్రియాళితోఁ గడపవచ్చును రాత్రులు పండువెన్నెలన్.

కరుణ—సఖీ! కాషాయవస్త్రములమీఁదినుండి దిగవ్రేలఁగాఁ అంటగొరిగిన తలకాయమీఁది జుట్టుపిలక యల్లలలాడఁగా పొడుగుగాఁ దాఁటిచెట్టువలె నెవ్వఁడో తరుణవయస్కుఁడీవంకకు వచ్చుచున్నాఁడు. అతఁడెవఁడు?

శాంతి—సఖీ! వాఁడు బుద్ధాగముఁడు.

బుద్ధా—(ఆకాశమునందు) ఓయుపాసకులారా! ఓభిక్షులారా! భగవంతుఁడైన బుద్ధునియొక్క వాక్యామృతమును వినుఁడు. (పుస్తకమునుజూచి చదువుచున్నాఁడు) "నేనిప్పుడు లోకములోని సుగతియు దుర్గతియు దివ్యచక్షుస్సుచేత జూచుచున్నాను. సమస్తసంస్కారములును క్షణికములు; ఆత్మ నిత్యము కాదు. కాఁబట్టి మీభార్యలనాక్రమించెడు భిక్షులయెడ మీరీర్ష్య నుఁ బొందఁగూడదు. ఈర్ష్యయే చిత్తమలము" (తెరవంకఁజూచి) ఓశ్రిద్ధా! ఇటురమ్ము.

శ్రిద్ధ—(ప్రవేశించి) రాజబంధులవారియాజ్ఞ యేమి?

బుద్ధా—ఉపాసకులను భిక్షులను నీవు తడవుగ నాలింగనము చేసికొనుచుండుము.

శ్రిద్ధ—దేవర యాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని నిష్క్రమించుచున్నది)

శాంతి—సఖీ! ఈమెయుఁ దామసీశ్రిద్ధయే.

కరు—అవును. అట్టిదే.

దిగంబ—(బౌద్ధునిజూచి పెద్దగొంతుతో) ఓరీ! భిక్షుకా! ఇటురమ్ము. నిన్ను నేనొకప్రశ్న యడుగవలెను.

బుద్ధా—(కోపముతో) ఓరీ! పాపపిశాచా! అట్లడిగెడదేమిరా?

దిగం—ఓరీ! కోపము మానుము. నేనొక్క శాస్త్రవిషయము నడిగెదను.

బుద్ధా—ఓక్షపణకా! నీవు శాస్త్రకథసహిత మెఱుఁగుదువా? కానిమ్ము. (సమీపమునకుఁబోయి) ఏమి యడిగెదవు?

దిగం—క్షణవినాశివైన నీ వెవరినిమిత్త మీవ్రతమును బూనితివో నాకుఁ జెప్పు.

బుద్ధా—ఓరీ! వినుము. మాసిద్ధాంతము ననుసరించినవాఁ డొకానొకఁడు క్షణికవిజ్ఞాన మొంది వాసనాబంధములను దెగఁగోసి ముక్తుఁ డగును.

దిగం—ఓరిమూర్ఖా! ఏదో మన్వంతరమునం దెవ్వఁడో ముక్తుఁ డయ్యెడు పక్షమున, ఇప్పుడే నశించెడు నీకందువలన నేమి యుపకారము కాఁగలదు? ఇంకొకప్రశ్న నడిగెదను నీ కిటువంటి ధర్మము నుపదేశించినవాఁ డెవఁడు?

బుద్ధా—నా కీధర్మము సర్వజ్ఞుఁడయిన బుద్ధదేవునిచే నుపదేశింపఁబడినది.

దిగం—ఓరీ! బుద్ధుఁడు సర్వజ్ఞుఁడని నీకెట్లు తెలిసినది?

బుద్ధా—ఓయీ! బుద్ధుఁడు సర్వజ్ఞుఁడని మాబుద్ధాగమముల వలననే ప్రసిద్ధము.

దిగం—ఓరిబుద్ధిహీనుఁడా! ఆతని కాతని మాటలవలననే సర్వజ్ఞత్వము సిద్ధించెడుపక్షమున, అప్పుడు నేనును సర్వజ్ఞుఁడనే. నీ పితృపితామహప్రభృతిత్రిసప్తపురుషులతోఁడఁగూడ నీవు నాకు దాసుఁడవని నాకును దెలిసినది.

బుద్ధా—ఓరి పాపపిశాచమా! మలపంకధరా! నేనెట్లు నీకు దాసుఁడనురా?

దిగం—ఓరి వేశ్యాభుజంగా! ఓదుష్టభిక్షుకా! ఇది నీకొకదృష్టాంతరముగాఁ జూపినానురా. ఇఁక నీకు విశ్వసింపఁ దగినప్రియవాక్య మొకటి చెప్పెదను. నీవు నీబుద్ధమతము విడిచి మాయార్హతశాసన మవలంబించి దిగంబరవ్రతమును ధరింపుము.

బుద్ధా—ఓరిపాపుఁడా! నీవు పాడగుటయే కాక యితరులను గూడఁ బాడుచేయఁ జూచుచున్నావా?

క. పావనసత్స్వాతంత్ర్యము
భావింప ననింద్య మద్ది వర్జించి వెసన్
నీవలెను బిశాచత్వము
నీవసుధను లోకనింద్య మెవ్వఁడు కోరున్?

యీయార్హతమతధర్మ మెవ్వఁ డవలంబించును?

దిగం—గ్రహనక్షత్రవారచంద్రసూర్యోపరాగ శుక్రరాహు పరమార్థజ్ఞానసంవాదశాస్త్రముచేత నీభగవంతుఁడైనమాయర్హతుని సర్వజ్ఞత్వము నిరూపిత మైనది.

బుద్ధా—(నవ్వి) అనాదిసిద్ధమయిన జ్యోతిశ్శాస్త్రమువలని యింద్రియాగోచరజ్ఞానముచేత మోసపోయి నీ వీయతికష్టవ్రతము నాశ్రయించు చున్నావు.

చ. పరిమితమైన దేహమునఁ బాయక లోపలనుండుజీవుఁ డే
సరణి నెఱుంగనేరుచు నసంగతి మై భువనత్రయుం బొగిన్?
కరము జ్వలించుచున్న, ఘటగర్భమునం దిడినట్టిదీప మే
కరణిని జూపనోపు గృహగర్భమునం గలవస్తుసంతతిన్?

కాఁబట్టి లోకద్వయవిరుద్ధమయిన యార్హతమతముకంటె బుద్ధమతమే శ్రేష్ఠమయినదిగాను, కేవల సుఖావహ మయినదిగాను, మిక్కిలి రమణీయ మయినదిగాను, నాదృష్టికి గోచరమగుచున్నది.

శాంతి—సఖీ! మనము మఱియొక చోటికిఁ బోవుదము.

కరుణ—ఆలాగుననే చేయుదము.

(అని ముందుకు నడుచు చున్నారు.)

శాంతి—(ముందువంకఁ జూచి) మనముందున్న యీపురుషుఁడు సోమసిద్ధాంతుఁడు. కానిమ్ము మన మక్కడకుఁ గూడఁ బోవుదము.

[అప్పుడు కాపాలికరూపధారి యైన సోమసిద్ధాంతుఁడు
ప్రవేశించుచున్నాఁడు.]

సోమ—(ముందుకు నడిచి)

మ. సముద్దారోగ్రనరాస్థిమాలికలు భూషల్ గా, శ్మశానంబె వి
శ్రమవాసస్థలిగాఁగ, భోజనపుఁబాత్రల్ పుఱ్ఱలై యొప్ప, ను
త్తమయోగాంజనశుద్ధదృష్టి మెయి నేఁ దర్శింతు నన్యోన్యభి
న్నము లీలోకము, లీశుకంబె నవిభిన్నంబుల్ గదా యం చెదన్.

దిగం—ఓహో! ఈపురుషుఁడు కాపాలికవ్రతమును ధరించుచున్నాఁడు. ఈతనినిగూడ నొకప్రశ్న యడిగెదను. (సమీపించి) ఓరీ! కాపాలికా! నరాస్థికపాలధారీ! నీధర్మ మెటువంటిది? నీమోక్ష మెటువంటిది?

సోమ—ఓరీ! క్షపణకా! ఇప్పుడు నాధర్మమును శ్రద్ధతో వినుము.

శా. మస్తిష్కాక్తవసాభిఘారిమహామాంసంబు ప్రేల్తున్ శిఖిన్;
శస్త్రబ్రహ్మకపాలపూరితసురన్ సద్భక్తి సేవింపుదున్;
బ్రస్తుత్యగ్రవికృత్తకంఠవిగళద్రక్తోగ్రధారాతతిన్
హస్తద్వంద్వకృతోపహార మిడి నే నర్చింతు నాభైరవున్.

బుద్ధా—(చెవులు మూసికొని) కటకటా! ఈధర్మచర్య మహాదారుణముకదా!

దిగం—అర్హాత! అర్హాత! ఘోరపాపకారి యెవ్వఁడో యీ బుద్ధిహీనుని వంచించెను.

సోమ—(కోపముతో) ఓరీ! పాపాత్మా! పాషండాధమా! బోడీ! చండాలా! కేశోల్లుంచకా! చతుర్దశభువనోత్పత్తి స్థితిప్రళయ ప్రవర్తకుండును వేదాంతసిద్ధాంతప్రసిద్ధప్రభావుండును భగవంతుండును సగుభవానీవల్లభుండు వంచకుఁడు గా? ఆయన ధర్మమహిమను నే నిప్పుడు కనఁబఱిచెదను.

మ. హరిరుద్రాబ్జభవాదినిర్జరసమూహంబెల్ల రావించెదన్;
సరిగా మింటఁజరించు తారకలసంచారంబు నే నిల్పెదన్;
బురశైలాదులతోడ నిమ్మహి పయఃపూర్ణంబు గావించి యీ
వరతోయంబును ద్రావెదన్ క్షణములో భాండంబుల న్సర్వమున్.

దిగం—ఓరీ! కాపాలికా! నే నిందుచేతనే నిన్నెవ్వఁడో యైంద్రజాలికుఁడు మాయలుచూపి మోసముచేసెనని చెప్పియున్నాను.

సోమ—ఓరి పాపీ! పరమేశ్వరుఁడైంద్రజాలికుఁడని యింకను నాక్షేపించుచున్నావా? వీని దుష్టత్వము కోపోద్రేకము కలిగించుచున్నది. (కత్తి యొరనుండి తీసి)

ఉ. ఈసిశితోగ్రఖడ్గవినికృత్తభవద్గళనాళికోచ్చలత్
ఫేనిలబుద్బుదాఘయుతభీకరశోణితభూరిధారలన్
నే నిదె తృప్తి చేసెద వినిశ్చలభక్తిని దుర్గకిష్టక్రీ
డానినదోల్లసడ్డమరుధాంకరణాగతభూతవర్గమున్.

(అని కత్తి పయి కెత్తుచున్నాఁడు.)

దిగం—(భయముతో) ఓమహానుభావా! అహింస పరమధర్మము సుమా. అని బుద్ధాగముని మఱుఁగు చొచ్చుచున్నాఁడు.)

బుద్ధా—(సోమసిద్ధాంతుని వారించుచు) ఓ మహానుభావా!

వినోదార్థముగా జరపఁబడినయీ వాక్కలహమునుబట్టి యీతాపసుని గొట్టుట యుక్తము కాదు.

సోమ—(ఖడ్గము నొరలో వేయుచున్నాఁడు.)

దిగం—(ఊఱటనొంది) ఓ మహానుభావా! ఇప్పుడుమీకుద్భవిల్లినఘోరరోషము శాంతిపొందినపక్షమున, నేను మిమ్ముఁ గొన్ని ప్రశ్న లడుగఁదలఁచి యున్నాను.

సోమ—అడుగు. అడుగు.

దిగం—మీయుత్తమధర్మమును నేను విన్నాఁడను. ఇఁక మీమోక్ష మెట్టిదో చెప్పుఁడు.

సోమ—వినుము—

మ. తమి నేరేన్ విషయానుభోగములచేఁ దక్కన్ సుఖంబందిరే!
యమలానందవిమూఢజీవదశయే యామోక్షమా నేని, ధీ
భ్రిమ లే కెవ్వఁడు కోరి వేఁడుకొనుఁ దత్పాషాణముక్తిం గనక!
ప్రియదాశిన్ సతిఁగాఁగఁ దన్ను శివుఁగా భావించి యాలింగనం
బమరం జేసి సుఖింప ముక్తియగునం చాశర్వుఁ డాడెం జుమీ.

శాంతి—పాపము శాంతిల్లునుగాక! పాపము శాంతిల్లునుగాక! భగవంతుఁ డయినభవానీపతి యిటువంటిశాస్త్రమునకుఁ దానెప్పు డయినను గర్త యగునా? ఇదియెవ్వరోదురాత్ములుకల్పించిరి.

బుద్ధా—ఓ మహానుభావా! రాగరహితులుకానివారికిముక్తి కలుగు నన్నయీమాట యాదరణీయము కాదు.

దిగ—ఓయీ! కాపాలికా! నీకుఁ గోపము రానిపక్షమున నే నొక్కమాట చెప్పెదను. రాగయుక్తుఁ డయినదేహధారి ముక్తుఁ డగుననుట వేదవిరుద్ధము.

సోమ—(తనలో) అయ్యో! వీరిమనస్సులు శ్రద్ధారాహిత్య

ముచేతఁ జెడియున్నవి. కానిమ్ము. (తెరవంకఁజూచి ప్రకాశముగా) ఓ శ్రద్ధా! ఇటురమ్ము.

[అప్పుడు కాపాలినీరూపధారిణియైన శ్రద్ధ ప్రవేశించుచున్నది]

కరుణ—సఖి! చూడు. రజస్సుయొక్క కూఁతురైనయీ శ్రద్ధను జూడు. ఈమె—

చ. విరిసిననల్లగల్వలను వీఁక యడంచువిలోలనేత్రముల్,
నరవిమలాస్థినిర్మితకనత్కమనీయవిభూషణావళుల్,
గురుజఘనస్తనాతిభరకుంఠితకోమలమందయానముల్,
సురుచిరపూర్ణచంద్రనిభసుందరవక్త్రము నొప్ప నొప్పెడున్.

శ్రద్ధ—(ముందుకువచ్చి) ఇదిగో వచ్చినదానను. స్వామీ! ఏమి యాజ్ఞ?

సోమ—ప్రియురాలా! దురభిమానియైన యీభిక్షుని ముందుగాఁ గౌఁగిలించుకొమ్ము.

శ్రద్ధ—(బుద్ధాగముని నాలింగనము చేసికొనుచున్నది)

బుద్ధా—(సంతోషముతో నాలింగనము చేసికొని యొడలు గగుర్పొడువఁగా జనాంతికముగా) ఓహో! ఏమి యీకాపాలినిసుఖస్పర్శ!

చ. చండతరానురాగమునఁ జన్నులు పాణులనొత్తి పల్వురన్
రండలఁ గౌగిలించితి ఘనస్తనభారలఁ దొల్లి; యెందు నీ
చండికచోపగూహభవసౌఖ్యముతో సరిగాన నంచు నే
దండిగ నూఱుసార్లు శపథంబులు చేసెద బుద్ధుతోడుగన్.

ఓహో! కాపాలికచరిత మెంతపుణ్యప్రదమయినది! ఓహో! సోమసిద్ధాంత మెంతశ్లాఘ్యమయినది! ఈధర్మ మాశ్చర్యకరమయినది. ఓమహానుభావా! సర్వవిధములచేతను నేను బుద్ధానుశాసనమును

విడిచి నీ పరమేశ్వర సిద్ధాంతమునందుఁ బ్రవేశించెదను. ఇప్పుడు నీవాచార్యుఁడవు: నేను శిష్యుఁడను. కాఁబట్టి నన్నిప్పుడే పారమేశ్వరదీక్షయందు బ్రవేశపెట్టుము.

దిగం—ఓరీ! భిక్షుకా! నీవు కాపాలినీస్పర్శనముచేత మయిల పడినాఁడవు. కాఁబట్టిదూరముగా నుండుము.

బుద్ధా—ఓరి పాపాత్మా! కాపాలినియొక్క పరిరంభణమహోత్సవముఁ గానక నేనింతవఱకును వంచితుఁడ నయితిని.

సోమ—ఓప్రియురాలా! నీవిప్పు డీక్షపణకునిఁగూడ నాలింగనము చేసికొమ్ము.

శ్రద్ధ—(దిగంబరసిద్ధాంతుని గాఁగలించుకొనుచున్నది)

దిగం—గగుర్పాటుతో ఓహో! అర్హాత! అర్హాత! ఓహో! ఏమి యీకాపాలినీ సుఖస్పర్శనము! ఓసుందరీ! నీవింకొకసారి నన్ను మరలఁ గాఁగిటఁజేర్చుము. (తనలో) ఔరా! నే నిప్పుడు మహత్తరమయిన యొకయింద్రియవికారమునకు లోఁబడినాఁడను. ఇఁక నేమి యుపాయము! ఇప్పుడేదియు క్షమ! కానిమ్ము. ఇప్పుడీనెమలిపింఛము కప్పుకొనెదను. (అని అట్లు చేయుచున్నాఁడు)

క. ఓ పీనఘనస్తని! ఓ
కాపాలిని! భీతహరిణకమనీయాక్షీ!
మాపటి కీవు రమించిన,
నాపయిఁ జేయఁగలదేది యాశ్రావకిచే?

ఓహో! కాపాలికశాస్త్ర మొక్కటియే భోగమోక్షసాధనము! ఓయాచార్యా! నేనిప్పుడు నీదాసుఁడ నయినాఁడను. నన్నుఁగూడ శ్రీమహాభైరవానుశాసనమునందు దీక్షితుని జేయుము.

సోమ—కూరుచుండుఁడు.

ఇద్దఱు—(కూరుచున్నారు.)

సోమ—(పాత్రము చేతఁబట్టుకొని ధ్యానము నభినయించుచున్నాఁడు.)

శ్రద్ధ—ఓ దేవా! ఈ పాత్రము సురాపూరిత మయినది.

సోమ—(చూచి తాను గొంత త్రాగి మిగిలినదానిని బుద్ధాగమ దిగంబర సిద్ధాంతుల కిచ్చుచున్నాఁడు.)

క. ఇది పావన మిది యమృతం
బిది యఘరోగౌషధ మిది యీశ్వర ఘటితం
బిది భవపాశచ్ఛేదక
మిది యాస్వాదింపుఁ డిపుడు తృప్తిగ మీరల్.

ఇద్దఱు—(ఆలోచించుకొనుచున్నారు.)

దిగం—మా కార్హతాశాసనమునుబట్టి మద్యపానముకూడదు

బుద్ధా—కాపాలికుఁ డెంగిలిచేసినకల్లు నేనెట్లుత్రాగగలను?

సోమ—(ఆలోచించి జనాంతికముగా) ఓశ్రద్ధా! నీ వాలోచించుచున్నా వేమి? పశుత్వ మిప్పుడును వీరిని విడువలేదు. నావదన సంసర్గదోషమువలన సుర యపవిత్ర మయినదని వీరెంచుకొనుచున్నారు. కాఁబట్టి ఓపూజ్యురాలా! నీవక్త్రాసవముచేత దీనిని శుద్ధిచేసి వీరికిమ్ము. స్త్రీలనోరు సదా శుచి యని తైర్థికులు సహితము చెప్పుదురు.

శ్రద్ధ—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను. (అని పానపాత్రము పుచ్చుకొని తాను గొంత త్రాగి మిగిలినదానిని వారిదాపునఁ బెట్టుచున్నది.)

బుద్ధా—ఇది మహాప్రసాదము. (అని పానపాత్ర మందుకొని త్రాగుచున్నాఁడు) ఆహా! ఏమి యీసురయొక్క సువాసన!

చ. సకియలపొత్తునన్ వెనుకఁ జక్కఁగ నెన్నియొసార్లుఁగ్రోలనే
వకుళసువాసనామధురవార సతీవదనాసవంబు? ని
య్యాకలుషసుందరీముఖసుహాసవ మానరుగాక దేవతల్,
ప్రకటసుధారసంబుపయి వాంఛయొనర్తురె దీనిఁ గ్రోలినన్?

దిగం—ఓరీ! భిక్షుకా! అంతయు నీవే త్రాగకుము. కాపాలినీ వదనోచ్ఛిష్టమయిన యీమద్యమును నాకుఁగూడఁ గొంత యిమ్ము.

బుద్ధా—(పానపాత్రము దిగంబరసిద్ధాంతుని ముం దుంచు చున్నాఁడు.

దిగం—(త్రాగి) ఓహో! ఏమి యీమద్యముయొక్క మాధుర్యము! ఏమి రుచి! ఏమి గంధము! ఏమి పరిమళము! అర్హదను శాసనములోఁబడి చిరకాల మిటువంటి సురారసములేక మోసపోతిని. ఓభిక్షుకా! నాయంగములు తిరుగుచున్నవి. నేను శయనించెదను.

బుద్ధా—అటు చేయుము. (ఇద్దఱును బరున్నారు.)

సోమ—ఓప్రియురాలా! మనకిప్పుడు వెలలేకయిద్దఱు దాసులు లభించినారు. కాఁబట్టి మనము నృత్యము చేయుదము.

(ఇద్దఱు నృత్యము చేయుచున్నారు.)

దిగం—ఓ భిక్షుకా! ఈకాలపాలికుఁడు—కాదుకాదు, ఈ యాచార్యుఁడు కాపాలినితోఁగూడ మంగళనృత్యము చేయుచున్నాఁడు. కాఁబట్టి వీరితో మనముకూడ నృత్యము చేయుదము.

బుద్ధా—అలాగుననే చేయుదము. (అనిమదము చేతసోలుచు నృత్యము చేయుచున్నారు.)

దిగం—క. "ఓ పీనఘనస్తని! ఓ
కాపాలిని! భీతహరిణకమనీయాక్షీ!

మాపటి కీవు రమించిన,
నాపయిఁ జేయఁగలదేది యాశ్రావకిచేఁ?’’

(అని పాడుచున్నాఁడు.)

బుద్ధా—ఆచార్యా! ఈశాస్త్రమత్యద్భుతమయినది! ఇక్కడ గష్టపడ నక్కఱలేకయే యభిమతార్థసిద్ధులుసంపాద్యములగుచున్నవి.

సోమ—ఇది యెంత యాశ్చర్యము! చూడు—

మ. తనియం బొందురు దీప్సితార్థవిషయత్యాగంబు లేకీమతం
బున మోక్షప్రియు లష్టసిద్ధులఁ గరంబున్, యోగవిఘ్నంబులై
యునికిం బ్రాకృతమంత్రసిద్ధులను వశ్యోచ్చాటనాకర్షమో
హనవిక్షోభణమారణాదులఁ దృణంబల్లెంతు రత్యంతమున్.

దిగం—ఓయి కాపాలికా! (ఆలోచించి) ఓరి యాచార్యా! ఓ రాజబాంధవా! (అని తూలుచుఁ దిరుగుచున్నాఁడు.)

బుద్ధా—ముస్నలవాటు పడనివాఁ డగుటచేత నీతపస్వి మధుపానాధిక్యమువలన మిక్కిలి మత్తెక్కియున్నాఁడు. కాఁబట్టి యిప్పుడితనిమత్తు పోవుపని చేయవలెను.

సోమ—ఆలాగుననే చేయుదము. (అని తననోటిలోనితమ్మి దిగంబర సిద్ధాతుని నోటిలోఁ బెట్టుచున్నాఁడు.)

దిగం—(స్వస్థుఁడయి) ఓయాచార్యా! నిన్నొక్కటి యడిగెదను. నీకిప్పుడు సురనాకర్షించుటయందున్నశక్తి స్త్రీపురుషులనాకర్షించుటలోఁగూడఁ గలదా?

సోమ—ఇది యేమిగొప్పయని యడుగుచున్నావు? చూడు—

మ. వరవిద్యాధరకాంతలన్, సురసతీవారంబు, నాగేంద్రసుం
దరులన్, యక్షవిలాసినీమణుల, మద్వాంఛానుసారంబుగా

మరియెవ్వారలనైన, ముజ్జగముల మద్గోప్యసంశ్లాఘ్యదు
ష్కరవిద్యాబలగౌరవంబున సమాకర్షింపఁగాఁ జాలుదున్.

దిగం—ఓయీ! మనముండఱమును మహామోహునికింకరుల మని యిప్పుడు నేను గణితముచేతఁ దెలిసికొన్నాఁడను.

ఇద్దఱు—నీవు తెలిసికొన్నదంతయు సత్యమే.

దిగం—అట్లయినయెడల మనమిప్పుడు రాజకార్యమొకటి యాలోచింపవలెను.

సోమ—అది యేది?

దిగం—సత్త్వపుత్రియైనశ్రద్ధను రాజుగారి యాజ్ఞప్రకారముగా మనము పట్టితేవలెను.

సోమ—అతొత్తుకూఁతు రెక్కడ నున్నదో నాకు జెప్పుము. నేను వెంటనే దానిని నావిద్యాబలముచేత నాకర్షించి తెప్పించెదను.

దిగం—నేనిప్పుడు లెక్కవేసి నీకుఁజూపెదను. (అనిబలపము పుచ్చుకొని భూమిమీఁద స్థానములువేసి గణించుచున్నాఁడు.)

శాంతి—సఖీ! ఇప్పుడుహతాశులయినవీరిమాటలు మాతల్లిని గూర్చినవైనట్టు వినబడుచున్నవి. మనము సావధానముగా విందము.

కరుణ—సఖీ! అలాగుననే చేయుదము. (అని యిద్దఱు నాలకించుచున్నారు.)

దిగం—గీ. జలమునను లేదు; లేదెందు స్థలమునందు;
శైలముల లేదు; లేదు పాతాళమందు;
శ్రద్ధ యయ్యది హరిభక్తి సహిత యగుచు
నున్న దిపుడు మహాత్ముల యుల్లములను,

కరుణ—(ఆనందముతో) సఖీ! నీవుభాగ్యశాలినివి. శ్రద్ధ విష్ణుభక్తిదేవియొక్క పార్శ్వవర్తినియై యున్నది.

శాంతి—(హర్షము నటించుచున్నది.)

బుద్ధా—నః ఆత్మకాముని విడిచిపోయిన ధర్ముఁ డెక్కడ నున్నాఁడు?

దిగం—(మరల సంకెలు గణించి)

గీ. జలమునను లేఁడు; లేఁ డెందు స్థలమునందు;
శైలముల లేఁడు; లేఁడు పాతాళమందు;
విష్ణుభక్తితో ధర్ముండు వేడ్కఁ గూడి,
యున్నవాఁడు మహాత్ముల యుల్లములను.

సోమ—(విషాదముతో) అక్కటా! మనమహారాజునకు గొప్పకష్టము వచ్చినది.

చ. తలఁపఁగ విష్ణుభక్తియె నిదానము శాశ్వతహర్ష సిద్ధికిన్;
గలసెను దానితో నిపుడు క్రన్నన సత్త్వకుమారి శ్రద్ధయున్;
జెలియగు కాముని న్విడిచి చేరెను ధర్ముఁడుగూడ నచ్చటన్;
దలఁతు వివేకుకార్య మిఁకఁ దద్దయు సిద్ధిని బొందినట్లుగన్.

అయినను మనము ప్రాణాంతోపద్రవము వచ్చినను వెనుక తీయక స్వామికార్యమును జేయవలెను. ఇప్పుడు ధర్మశ్రద్ధలను బట్టి తెచ్చుటకయి మహాభైరవీవిద్యను బంపుజేసెదను.

(అని ముగ్గురును నిష్క్రమించుచున్నారు.)

శాంతి—సఖీ! ఇప్పుడు మనమును హతాశు లయిన వీరి దుర్వ్యవసాయమును దేవియైనవిష్ణుభక్తికి నివేదింతము రమ్ము.

(అని నిష్క్రమించుచున్నారు.)

చతుర్థాంకము.

[అప్పుడు మైత్రి ప్రవేశించుచున్నది.]

మైత్రి—మహాభైరవియొక్క వాతఁ బడకుండ ధర్మునితోఁ గూడ నా ప్రియసఖియైన శ్రద్ధను విష్ణుభక్తి కాపాడెనని ముదితవలన నేను విన్నదానను. కాఁబట్టి యాతహాతహ పడుచున్న మనస్సుతో నా ప్రియసఖి నెక్కడఁ జూడఁ గలుగుదును?

(అని ముందుకు నడుచుచున్నది.)

[అంతట శ్రద్ధ ప్రవేశించుచున్నది.]

శ్రద్ధ—(నలుగుదిక్కులనుజూచి భయోత్కంపముతో)

మ. వెనుకన్, మర్త్యకపాలకుండలవతిన్, విద్యుచ్ఛటావిక్షిప
క్షనదృష్టిన్ శిఖకీలికారుణకచాత్యంతోగ్ర, బాలేందుర
శ్మినిరోద్యత్ఖరదంష్ట్రికాంతరచలజ్జిహ్వన్, మహాభైరవిన్
గనుచున్నట్లు వడంకెఁ జిత్తమిపుడున్ రంభాదళప్రక్రియన్.

మైత్రి—(తనలో) అయ్యో! నా ప్రియసఖియైన శ్రద్ధాదేవి భయసంభ్రమోద్భ్రాంతహృదయయయి గాలిచేఁ గదలుచున్న కదళీతరుపత్రకాండమువలెఁ గంపమొందుచున్న యంగములతోఁ దనలోఁ దానేదో యాలోచించుకొనుచు, దాపునకువచ్చినను నన్నుఁ జూడకున్నది. కాఁబట్టి నేనే యామెను బలుకరించెదను. (ప్రకాశముగా) ఓ ప్రియసఖి! శ్రద్ధా! ఇదేమి? నీవు మనస్తాపముచేత నన్ను సహితము చూడకున్నావు!

శ్రద్ధ—(చూచి నిట్టూర్పుతో) ఓ ప్రియసఖి! మైత్రి

క. చెలి! కాళరాత్రినోటను
బలుకోఱలనడుమఁ జిక్కి ప్రాణముతో డన్

వెలువడుచు నేను గనుఁగొనఁ
గలిగితి నీజన్మమందె క్రమ్మఱ నిన్నున్.

కాఁబట్టి నీవు దగ్గఱగా వచ్చి నన్నుఁ గౌఁగిలించుకొమ్ము.

మైత్రి—(ఆలింగనము చేసికొని) సఖీ! అల్లు విష్ణుభక్తి మహాభైరవియొక్క ప్రభావము నడఁచివేసినను, నీయంగములింకను గంపమొందుచున్న వేమి?

శ్రద్ధ—

మ. వెనుకన్, మర్త్యకపాలకుండలవతిన్, విద్యుచ్ఛటావిక్షిప
ద్ఘనదృష్టిన్, శిఖికీలికారుణకచాత్యంతోగ్ర, బాలేందుర
శ్మినిభోద్యత్ఖరదంష్ట్రికాంతరచలజ్జిహ్వన్, మహాభైరవిన్
గనుచున్నట్లు వడంకుఁ జిత్తమిపుడున్ రంభాదళప్రక్రియన్.

(అని మరలఁ బఱించుచున్నది.)

మైత్రి—(భయముతో) హా! హతాశురాలయినయామె ఘోరరూపము కలదిగదా? ఆప్రకారముగా వచ్చి యామె యేమి చేసినది?

శ్రద్ధ—సఖీ! వినుము—

చ. ధరణికి డేగడిగ్గెడువిధంబున భైరవి డిగ్గి, నన్ను దు
ర్భరచరణద్వయిం బొదివి, వామకరంబున ధర్ముఁ బట్టి, యం
బరమున కేగె వేగఁ, బెరుమాంసపుముద్దలు రెండు గృధ్రి భీ
కరనఖరాగ్రకోటి నిడి గ్రక్కున నింగికిఁ బాఱు కైవడిన్.

మైత్రి—అయ్యో! అయ్యో! (అని మూర్ఛిల్లుచున్నది.)

శ్రద్ధ—సఖీ! ఊఱడిల్లుము.

మైత్రి—(తెలివి తెచ్చుకొని) తరువాత. తరువాత.

శ్రద్ధ—తరువాత నాయార్తవాదమువలన దయార్ద్రహృదయ యయి—

మ. పౌరి గద్దింపుచు విష్ణుభక్తి యచటన్ భ్రూభంగకౌటిల్యభీ
కరమై నిర్భరకోపపాటలము నా కంటన్విలోకింపఁగా,
ధరణిం గూలెను, వజ్రపాతహతిచేతన్ భూమిపైఁద్రెళ్లు సు
స్థిరభూభృచ్ఛిలయట్లు, భైరవి శిరోస్థివ్రాతముల్ నుగ్గుగాన్.

మైత్రి—ప్రియసఖీ! దైవవశముచేతఁ బులినోటఁ బడి వెలువడినకురంగాంగనవలెనే నీవును నీభాగ్యముచేతఁ బ్రతుకఁగంటివి. తరువాత. తరువాత.

శ్రద్ధ—తరువాత విష్ణుభక్తిదేవి "నన్నుసహితమవమానింప బ్రవర్తించుచున్న దురాత్ముఁడయినయీమహామోహప్రేతమును నేను సమూలముగా నిర్మూలము చేసెదను" అని కోపావేశముతోఁ బలికి, నావంకఁజూచి "ఓశ్రద్ధా! నీవుపోయివివేకునితోనిట్లుచెప్పుము. నీవు కామక్రోధాదులను నిర్జించుటకయి ప్రయత్నింపుము. అప్పుడు వైరాగ్యోదయము తప్పక గలుగును. నేనును సమయమువేచిప్రాణాయామాదుల కుత్సాహము పుట్టించి నీసైన్యము ననుగ్రహించెదను. ఋతంభరాది దేవులు శాంత్యాదులకౌశలముచేత నుపనిషద్దేవీసంగమమువలనఁ బూజ్యుఁడ వయిన నీకుఁ బ్రబోధచంద్రుఁ డుదయించు సాధనమును జేయుదురు" అని సెలవిచ్చినది. కాఁబట్టి నేనిప్పుడు వివేకుని సన్నిధికిఁ బోవుచున్నాను. ఇప్పుడు నీ వేపనిమీఁదదినములు పుచ్చుచున్నావు?

మైత్రి—అక్కచెల్లెండ్రము మేము నలువురమును విష్ణుభక్తి యొక్క యాజ్ఞచేత వివేకుని కార్యసిద్ధికొఱకు మహాత్ముల యాత్మల యందు నివసించెదము.

చ. వను సుఖజీవులందుఁ, గరుణన్ ఘనదుఃఖితులందుఁ, బుణ్యకా
ర్యనిరతులందు సమ్మదిత, భ్రష్టకుబుద్ధులయందుపేక్ష, వా
రనుపఁదలంతురి; మేముటనుండుట నాత్మలు రాగలోభము
ఖ్యాఖిలదోషదూషితము లయ్యును గాంచును నిర్మలత్వమున్.

కాఁబట్టి యీవిధముగాఁ దోఁబుట్టువులమైన మేము నలువురమును వివేకాభ్యుదయము కొఱకైన వ్యాపారముచేత వాసరములు గడపుచున్నాము. ఓప్రియసఖీ! నీవిప్పుడెక్కడ వివేకమహారాజును గనుఁగొనగలవు?

శ్రద్ధ—"రాఢాదేశ మని యొకటి యున్నది. అక్కడభాగీరథీ సముద్రదేశమున కలంకారభూతమయిన చక్రతీర్థమునందు మీమాంసానుగతమైన మతిదేవితోఁడఁ గూడ నెట్లో ప్రాణములు నిలుపుకొని వ్యాకులహృదయముతో నుపనిషద్దేవీసంగమార్థముగా వివేకుఁ డహర్నిశమును దపస్సు చేయుచున్నాఁడు" అని దేవియైన విష్ణుభక్తిదే నాతో సెలవిచ్చినది.

మైత్రి—ఓప్రియసఖీ! నీవచ్చటికిఁ బొమ్ము. నేనును నాపనికిఁ బోయెదను.

శ్రద్ధ—అట్లుచేయుము.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు)

ఇది విష్కంభము

[అప్పుడు వివేకమహారాజును బ్రతీహారియుఁ బ్రవేశించుచున్నారు]

వివే—ఓరి మహామోహా! ఓరిదోసకారిపీనుఁగా! ఈమహాజనులెల్ల నీవల్ల సర్వవిధములచేతను జెడిపోయిరి.

శా. జ్ఞానానందము నిస్తరంగము మహాశాంతంబు ప్రోద్యస్పృహ
త్యానూనంబు మహామృతాబ్ధిజల మాహాత్రాగరందుండియున్;
వే నిస్సారమరీచికాజలమునందే మున్గుచుం దేలుచున్
బానస్నానము లాచరించెదరు విభ్రాంతి స్వమూఢాత్మకుల్.

సంసార చక్రవాహకుఁడై యున్నమహామోహునకజ్ఞానమేమూలము. ఆయజ్ఞానము తత్త్వబోధమువలననే నివృత్తి కాఁగలదు. ఎట్లన—

గీ. అవని నజ్ఞానమూలకమైనయట్టి
పృథులసంసారవృక్షంబు పెల్లగించి
పరముఁ గూర్ప విశ్వేశ్వరోపాసనాఖ్య
బీజజన్యావబోధంబె వెరవుసుమ్ము.

తఱచుగా మంచివారు పూనినకార్యములకు దేవతలు తోడుపడుదురని తత్త్వవేత్తలు చెప్పుదురు. అందుచేతనే విష్ణుభక్తిదేవి యిప్పుడు "నీవు కామాదులను గెలుచుట కుద్యోగింపుము; నేనును నీపక్షమవలంబించెదను" అని సందేశము పంపినది. అక్కడఁ బ్రధానవీరుఁడై యున్న కాముని వస్తువిచారుఁడొక్కఁడే జయింపఁదగినవాఁడు. కానిమ్ము. వానిని నిర్జించుటకయి యిప్పు డతనినే నియమించెదను. ఓ వేదవతీ! నీవు వస్తువిచారుని బిలుచుకొనిరమ్ము.

ప్రతి—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని నిష్క్రమించి వస్తువిచారునితోఁగూడఁ బ్రవేశించుచున్నది)

వస్తు—అయ్యో! నిర్విచార సౌందర్యాభిమానవర్ధిష్ణుఁడైన కామపిశాచునిచేతను ముఖ్యముగా దురాత్ముఁడైన మహామోహునిచేతను లోకము చెడిపోవుచున్నది.

చ. కలికి యటంచునున్, గలువకంటి యటంచును, సుభ్రువంచు మం
జులసుముఖాబ్జ యంచు. ఘనస్తనియంచు, బృహన్నితంబ యం

చెలిమిఁ నుతించుఁగాంచు భ్రమియించు రమించు బుధుండు నార! చె
ల్వ లశుచిభస్త్రిలం దనను దలంపడు మోహవిచేష్టితంబునన్.

చక్కఁగా వస్తువిచారము చేయఁగలన్మాత్మబుద్ధులకుసహితము మాంసాస్థిపంజరములైన స్త్రీలు స్వభావదుర్గంధనిలయము లనియు బీభత్సవేష లనియు వైరాగ్యము కలుగకున్నది. అట్లయినప్పుడు వారి యం దితరగుణారోపణము చేయుట స్పష్టమే.

మ. వరముక్తామణిహారముల్ మణిరణత్స్వర్ణాంగదంబుల్, సితాం
బరచిత్రోరుదుకూలముల్, ఘుసృణపున్నైస్మపూఁతలున్, దావిపూ
సరముల్, పైఁ బయిఁ జూచి యల్పమతు లిచ్చం గాంత్రు సమ్మో [హమున్
ధర నారుల్ నరకార్థనామ లనుచుం దర్కింతు రుద్యన్మతుల్.

(ఆకాశమువంకఁ జూచి) ఓపాపీ! చండాలా! ఓరి కామా! అనావలంబనముగా వచ్చి నీవీలాగున జనులను వ్యాకులపెట్టుచున్నా వేమిరా? ఓహో! కామావిష్టుఁడు—

మ. ననుఁ గామించెను బాల యీమె, యెలమిన్ సన్నిమ్మృగాంకాస్య [చూ
చెను, నీయుత్పలనేత్ర కౌఁగిటను జేర్చెన్ న, న్ననున్ గామి: యో
ఘనమూర్ఖా! నినుఁ గాంచె నెవ్వతె? నినుం గామించె నెవ్వార్తె? యం
గన మాంసాస్థులబుంగ; లోపలి నిరాకారుండె వీక్షించెడున్.

ప్రతీహారి—ఓమహానుభావా! ఇటురమ్ము.

ఇద్దఱు—(ముందుకు నడుచుచున్నారు.)

ప్రతీ—అదె మహారాజు ఆసీనుఁడయి యున్నాఁడు. నీవా యనసన్నిధికిఁ బొమ్ము.

వస్తు—(దాపునకుఁబోయి) దేవా! జయముగుఁగాక! జయముగుఁగాక! వీఁడె వస్తువిచారుఁడు దేవరకుఁ బ్రణమిల్లుచున్నాఁడు.

వివే—వస్తువిచారా! ఇక్కడఁ గూర్చుండుము.

వస్తు—(కూరుచుండి) దేవా! మీ సేవకుఁడు వీఁడిదె వచ్చియున్నాఁడు. ఆజ్ఞ యేమో యనుగ్రహింపవలెను.

వివే—మహామోహునితో మనకు యుద్ధము సంప్రాప్తమయినది. అక్కడఁ బ్రధానవీరుఁడు కాముఁ డానికిఁ బ్రతివీరునిఁగా మేము నిన్ను నిరూపించినాము.

వస్తు—దేవరవారు నన్నిట్లు సంభావించుటచేత నేను ధన్యుఁడనయినాఁడను.

వివే—ఇఁక నీ వేయాయుధముచేతఁ గాముని జయించెదవు?

వస్తు—ఓహో! పంచశరుఁడా? వానికున్నవి యైదమ్ములు. పూవిల్తుని గాముని జయించు టెంతపని? ఇక్కడఁగూడ శస్త్రగ్రహణ మపేక్షింపవలెనా దేవరవారు చిత్తగింపుఁడు.—

ఉ. ఇంద్రియమార్గమందు మనసేగకయుండఁగ దారిమూసెదన్
చంద్రనిభాస్యలం దలఁచినన్, ముఖదర్శన మాచరించినన్
సాంద్రవికారముల్ గలుగు; నాతులు రోఁతలకిమ్ములంచు, రా
జేంద్ర! ప్రతిక్షణంబు మదినెంచుచుఁ గాముని రూపుమాపెదన్.

వివే—మేలు! మేలు!

వస్తు—అంతేకాక,

చ. తతపులినస్రవంతుల, నితాంతపతజ్ఝరచిక్కణోపలాం
చితగిరులన్, సుసాంద్రతరుశీతలపుణ్యవనవ్రజంబులన్,
యతిబుధసంగతిం దసరి, వ్యాసవినిర్మితశాంతివాక్యముల్
ధృతిఁ బఠియింప నబ్బిన, నిఁకెక్కడి కాముఁ డిఁకేటి కామినుల్?

నారీమణియే కామునికిఁ బ్రధానాస్త్రము. అట్టినారియొక్క తె జయిం పఁబడినపక్షమున, తత్సహాయు లందఱును విఫలప్రయత్నులయి భంగమును బొందుదురు. ఎట్లన—

ఉ. గందముఁ, గౌముదీనిశలుఁ గల్వలరాయఁడు, బూవుఁదోఁటలం
 దందపుఁబాటపాడు మధుపాళుల నొప్పు వసంతకాలమున్,
 మందకదంబవాయువులు, మందరవాబ్దలసద్దినంబులున్,
 డిందనికామమిత్రములు; నిర్జితు లిందఱు స్త్రీల గెల్చినన్.

ఇఁకఁ గాలవిలంబము చాలును. ఇప్పుడు దేవరయాజ్ఞ యేమి?

క. ఉరుతరవిచారశరముల
 నరిబలములఁ గూల్చి నేన యడఁచెదఁ గామున్;
 గురుసేనఁ ద్రుంచి పార్థుఁడు
 శరధారల సింధురాజుఁ జంపినకరణిన్.

వివే—(ప్రసాదపూర్వకముగా) మంచిది. నీవు శత్రువిజయ మునకొఱకు సన్నద్ధుఁడవు కమ్ము.

వస్తు—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను. (అనిప్రణమిల్లి నిష్క్రమించుచున్నాఁడు)

వివే—వేదవతీ! నీవు పోయి క్రోధుని జయించునిమిత్తము క్షమను బిలుచుకొని రమ్ము.

ప్రతీ—దేవరయాజ్ఞాపించినట్లు చేసెదను. (అని నిష్క్రమించి క్షమతోఁగూడఁ బ్రవేశించుచున్నది)

క్షమ—

ఉ. క్రోధమహాంధకారఘనదుర్గ్వికటభ్రుకుటీతరంగరా
 డ్రాధిక లుగ్రసాంధ్యకిరణారుణదృష్టులు నా మహాఖిష

త్సాధనదూషణోక్తులకు నల్గక సైతురు, వీరలో యనన్,
సాధులు నిశ్చలాత్మమలసాగరతుల్యగభీరు లెంతయున్.
(శ్లాఘనపూర్వకముగాఁ దన్నుఁ జూచుకొని)
ఉ. లేదు వచోధికశ్రమము; లేదు శిరఃపరిపీడనంబునున్;
లేదు మనోపతాపమును; లేదు శరీరవిమర్దనంబునున్;
లే దలహింస యాదిగ గణింపఁగఁ గల్గునవర్థయోగమున్;
బోధిగ నేన తద్దయును గ్రోధజయంబున శ్లాఘ్య నయ్యెదన్.
(ఇద్దఱును ముందుకు నడుచుచున్నారు)

ప్రీతీ—అదె మహారాజుగారు. ప్రియసఖీ! ఆయనను సందర్శించుకొమ్ము.

క్షమ—(సందర్శించి) దేవా! జయ మగుఁగాక! జయ మగుఁగాక! ఇదిగో దేవరవారి దాసురా లయినక్షమ సాష్టాంగప్రణామము చేయుచున్నది.

వివే—ఓ క్షమా! ఇక్కడఁ గూరుచుండుము.

క్షమ—(కూరుచుండి) దేవా! ఈసేవకురా లెందునిమిత్తము పిలిపింపఁబడినదో యాజ్ఞ యిండు.

వివే—ఓ క్షమా! మా కిప్పుడు సంప్రాప్త మయినయుద్ధమునందు దురాత్ముఁ డయినక్రోధుని నీవు జయింపవలెను.

క్షమ—దేవరవారి యనుగ్రహమువలన నేను మహామోహుని నైనను జయించుటకు సమర్థురాల నగుదును. ఇఁక నాతని యనుచరమాత్రుఁ డైన క్రోధుఁ డెంత? నేనాపనిని శీఘ్రముగా నే నిర్వహించెదను.

ఉ. అన్నిట దేవయజ్ఞపితృయజ్ఞతపోధ్యయనక్రియాదు లె
న్నెన్నొ యకారణంబ సమయించెడువానిని బాపకర్మునిన్

గన్నుల నిప్పుకల్ కరముఁ గ్రక్కెడువాని వధింతుఁ గ్రోధునిన్
మున్నలభద్రకాళి యదయుర్ మహిషాసురుఁ జంపినట్లుగన్.

వివే—ఓశమా! ఇప్పుడు క్రోధవిజయోపాయము నాకు వినిపింపుము.

శమ—దేవా! విన్నవించెదను వినుఁడు.

చ. పురుషుఁడు క్రుద్ధుచోటనగు మోము, దురాగ్రహుచేఁ బ్రసాదముర్
బరుషవచస్కుచేఁ గుశలవార్త, ప్రమోదము తాడనోగ్రుచేఁ,
నరపఁగఁ జెల్లుఁ? బొందురు రనిర్జితచిత్తులు దైవికాపదు
త్కరమున; క్రోధభావ మెటుకల్గు దయారసమానసంబులన్?

వివే—సాధు! సాధు!

శమ—దేవా! క్రోధుని జయించుటవలననే హింసాపారుష్య మానమాత్సర్యాదులు సహితము జయింపఁబడినవా రగుదురు.

వివే—మంచిది. నీవు శత్రువిజయమునకు సంసిద్ధురాలవు కమ్ము.

శమ—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని నిష్క్రమించుచున్నది.)

వివే—వేదవతీ! లోభునిజయించుటకయి సంతోషునిబిలుచుకొనిరమ్ము.

ప్రతీ—దేవర సెలవిచ్చినట్లు చేసెదను. (అని నిష్క్రమించి సంతోషునితోడఁ గూడఁ బ్రవేశించుచున్నది.)

సంతో—(ఆలోచించి జాలితో)

చ. ప్రతివనమందు స్వేచ్ఛముగఁ బండ్లు లభించును భూరుహంబులన్
హితవుగ నెల్లచో దొరకు నీళ్ళకు జల్లని స్వాదుతోయముల్;

ప్రతిలతయందుఁ జిక్కు మృదుపల్లవముల్ సుఖశయ్య కింపుగా;
నతికృపణుల్ శ్రమంపకుదు రట్లయియున్ ధనికాంగణంబులన్.

(ఆకాశమువంకఁ జూచి) ఓరిమూర్ఖా! లుబ్ధా! నీయీవ్యామోహము దురుచ్ఛేదముగదా!

చ. ధనమృగతృష్ణికాబ్ధి జలధార వృథా దగఁగొన్ననీవు దా
పునఁ గన, నెన్నిసార్లు చెడిపోవఁగలేదు భవత్ప్రయత్నముల్?
మనుజమృగంబ! యాశనిటుమాన వటయ్యును; నేఁడుమాఱుగా
దునుఁగడు నీమనం బశనితో శిలతో నదిచేయఁగాఁబడెన్.

లోభాంధకారహతుఁడవైన నీయీచేష్టితము మనస్సున కాశ్చర్యము కలిగించుచున్నది.

ఎట్లనిన—

మ. ధనమార్జించెద నంచుఁ, బ్రాప్తమగువిత్తంబింక హెచ్చింతు నం
చును, లాభంబును వృద్ధిఁ గూరిచెద నంచున్ సొమ్మొధ్యానింతు నీ
వనిశంబున్; గన వన్నిటిందినెడియాయాశాపిశాచంబు గ్ర
క్కున లోభాంధతమోవృతున్ నినున్ బల్మినం చక్కటా!

మఱియును,

చ. ధనము గడించుచో మొదటఁ దద్దయుఁ గష్టము; కల్గునాపయిన్
ధనమునకున్ ఉ ఘుబును వినాశము రెండు వియోగమార్గముల్;
ధనము నశింపఁ గల్గును వ్యథల్; సిరిఁ గూర్పమిఁ గల్గవావ్యథల్;
ధనమును గూర్పకుండుటయె దానిగూర్చుటొ మీకు చెప్పుమా,

అంతేకాక,

మ. అనయుంబున్ నటియించు మృత్యువుశిరంబందున్; జరాపన్నగం
బును మిర్రింగున్నను; విశ్వముక్ దినువధూపుత్రామలాగృహ్రముల్

ఘనబోధాంబులఁ బాచి లోభరజమున్ గాఢాజ్ఞతాజన్యమున్,
క్షణ మానందసుధాంబుధిన్ మునుఁగుమా శశ్వత్సుఖంబబ్బెడున్

ప్రతీ—వీరె ప్రభువువారు. ఓమహానుభావా! ఈయనసన్నిధానమునకుఁ బొమ్ము.

సంతో—(సమీపమునకుఁబోయి) స్వామీ! జయమగుఁగాక! జయమగుఁగాక! వీఁడె సంతోషుఁడు. (అని ప్రణమిల్లుచున్నాఁడు.)

వివే—ఇక్కడఁగూర్చుండుము. (అని సన్నిధానమునందుఁ గూరుచుండఁబెట్టుకొనుచున్నాఁడు.)

సంతో—(వినయముతోఁ గూరుచుండి) ఈభృత్యజనునిపని యేమో దేవర యాజ్ఞాపింపవలెను.

వివే—నీప్రభావము లోకవిదితమయినది. కాఁబట్టి యిప్పుడు బహుభాషలతోఁ బని లేదు. నీవు లోభునిజయించుటకయి వారణాసికిఁ బోవలెను.

సంతో—దేవర యాజ్ఞాపించినట్లు చేసెదను.

చ. కలయ మెలంగుచున్ బహుముఖంబుల ముజ్జగము జ్జయించి లో
నలరుచు, దేవభూసురమహావధబంధనలబ్ధవృద్ధియై
వెలసినలోభునిన్ బరిభవించి జయించి యొనర్తు భస్మమున్,
బలమున మున్ను దాశరథి పంక్తిముఖున్ నుఱుమాడినట్లుగన్.

(అని నిష్క్రమించు చున్నాఁడు.)

[అప్పుడు వినీతవేషుఁడైన యొకపురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు]

పురు—దేవా! విజయప్రయాణమంగళములు జరపఁబడినవి. మహాహుర్తికులు పెట్టిన విజయయాత్రాసమయము సమీపించినది.

వివే—అట్లయినయెడల సేనాపతులు సైన్యములను బయలు దేఱుటకు నియమింపవలెనని చెప్పు.

పురు—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని నిష్క్రమించు చున్నాఁడు.)

[తెరలో]

చ. పటుకటదానమత్తమధుపంబులఁ గూర్చుఁడు సద్విపంబులన్;
బటిమ నిడుండు తేరులకు వాయుజవంబుల వాహవంబులన్;
భటు లొనరింపుఁ డీటెల నభ మ్మసితాబ్జమహావన మ్మనన్;
జటులకృపాణపాణుల వెసం జనుఁ డాశ్వికులార! శ్రేణులై.

వివే—మంచిది! మంగళసన్నాహము లాచరించి, నేనును ప్రయాణమయ్యెదను. (పారిపార్శ్వకునితో) సంగ్రామోచితమయిన రథము నాయత్తపఱిచి తీసికొనిర మ్మని సారథి కాజ్ఞాపింపుము.

పారి—దేవరవా రాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని నిష్క్రమించు చున్నాఁడు.)

[అప్పుడు యుద్ధరథమును సిద్ధముచేసికొని సారథి
ప్రవేశించు చున్నాఁడు.]

సార—దేవా! ఇదిగో రథము సిద్ధముగా నున్నది. దేవరవారు రథారోహణము చేయవచ్చును.

వివే—(మంగళవిధులను నిర్వర్తించి రథారోహణము నభినయించుచున్నాఁడు.)

సార—(రథవేగము నిరూపించి) దేవా! చిత్తగింపుఁడు. చిత్తగింపుఁడు.

మ. ప్రచురోద్ధూతరజశ్ఛటానుమితశుంభద్వ్యానధావత్ఖురా
గ్రిచయేషత్పరిచుంబితోర్వ్యపరిభాగంబుల్ మహావాహముల్
ప్రచలన్మంథరమథ్యమానజలధిధ్వానోగ్రఘోషంబుగా
నుచితప్రోథినిహ్వేయమార్గమున, నోహో! తెరుఁగొంపో యెదుర్.

ఇదిగో సమీపమునఁ ద్రిభువనపావనమైన వారణాసీనగరము దృష్టి పథమునఁ బడినది.

శా. ధారాయంత్రపతజ్జలోద్ధతనితాంతధ్వానసంయుక్తముల్,
నీరేజారికరప్రభాధవళముల్, చెల్వొందు సౌధాగ్రముల్,
భూరిప్రేత్యములై శరద్ధవళజీమూతాంతిరాజత్తటి
చ్ఛ్రీరమ్యంబు లవే పతాక లెసఁగున్ జిత్రద్యుతి న్మేడలన్.

ప్రతిమకుళలగ్నమధుకరనికర ఝంకారముఖరంబులును వికసితకుసుమ విసరవిగళన్మకరంద వర్షాతిశయ ధురంధరంబులును నానాప్రసూన సుగంధబంధురంబులును శ్యామాయమాననిబిడచ్ఛదచ్ఛాయావనీరుహ మనోహరంబులును నగపురోద్యానప్రదేశంబు లవిగో సమీపంబునఁ గానవచ్చుచున్నవి. ఈవాయువులుసహిత మిక్కడఁ బాశుపతవ్రతమును గ్రహించిన దాపసులవలెనే కానఁబడుచున్నవి.

ఎట్లన—

చ. సురనదినీటఁ దేలి, సురజోభసితంబు కరంబుఁ దాల్చి, యీ
శ్వరుపయి నర్చనల్ సలుపుచాడ్పున మీఁదను బూలు రాల్చి, ని
ర్భరమధుపస్వరంబునను బాటలు చాలఁ జెలంగ, వాయువుల్
కరమును నృత్యము ల్సలుపుఁ గంపమునొందులతాభుజంబులన్.

వివే—(ఆనందముతోఁ జూచి)

మ. హృదయాకర్షక మయ్యెఁ జంద్రమకుటుండిందుంట నీకాశి, తాఁ
బదమై ముక్తికి విద్యయట్లు, తమ మార్పన్ స్వప్రభానందమై;
యిదె భూదేవికి వ్రేలుముత్యసరమై యింపొందెడున్ వంగి స్వ
ర్ణది, వక్రేందుకళన్ గడున్ నగుచు ఫేనవ్యాజహాసంబునన్.

సారథి—ఓ దేవా! చూడుఁడు, చూడుఁడు. ఇది గంగాతీరమున కలంకారభూతమును ద్రిభువనపావనమును నైన శ్రీమత్త్రిలోకగురు విశ్వేశ్వరాఖ్యమహాదేవుని యాలయము.

వివే—(హర్షముతో) ఓహో!

క. మును జెప్పిరి యీ దేవుం
డనఘుఁడు క్షేత్రాధినాథుఁ డని క్షేత్రజ్ఞుల్;
తనువు లిట విడిచి వింతగ
ఘనపుణ్యులు భక్తజనులు కలియుదు రితనిన్.

సార—దేవా! చూడుఁడు, చూడుఁడు, అదిగో మనలను జూచినమాత్రమున నే కామక్రోధలోభాదు లిక్కడనుండి దూరముగాఁ దొలఁగుచున్నారు.

వివే—వా రట్లే యగుదురు. కానిమ్ము. నేనీయాలయము నంటుఁ బ్రవేశించి యభీష్టసిద్ధికై యీ భగవంతునికి నమస్కరించెదను. (అని రథమునుండి దిగి గుడిచొచ్చి చూడ్కి నిగిడించి) ఓ మహాదేవా! నమస్కారము నమస్కారము. నన్ను దయచూడుము.

క. కావింతు నమస్కృతు లివె
హో విమలజ్ఞానదేహ! హో చంద్రధరా!
హో వేదత్రయలోచన!
సేవకున కొసంగు నాకు శ్రేయఃప్రాప్తుల్.

(అని నమస్కరించుచున్నాఁడు)

సార—దేవా! ఇది త్రిభువనగురుఁడైన యాదికేశవస్వామి యాలయము.

వివే—అక్కడకు రమ్ము. (అని వెళ్ళి యాదికేశవస్వామికిఁ బ్రదక్షిణముచేసి) ఓ భగవంతుఁడా! జయముగుఁగాక! జయముగుఁగాక!

దండకము. అమరచయచమూచక్ర చూడామణిశ్రేణినీరాజితోపాంత పాదద్వయాంభోజ! రాజన్నఖద్యోతకిమ్మీరితస్వర్ణపీఠా!

స్ఫురద్ద్వైత విభ్రాంతిసంతాన సంతప్తవందారుసంసార నిద్రాపహా
రైకదక్షా! క్షమామండలోద్ధార సంభారసంఘట్టదంష్ట్రాగ్ర కోటి
స్ఫురచ్ఛైలచక్రా! క్రమాక్రాంతలోకత్రయా! బాహుబలప్రోద్ధ
తాభీలగోవర్ధనచ్ఛత్రి నిర్వారితాఖండ లోద్యోజితాకాండచండాం
బువాహాతి వర్షత్రసద్గోకులత్రాణవిస్మాపితాశేషవిశ్వా! ప్రభూత్తంస!
దైతేయసీమంతినీవర్గసీమంతసిం దూరసంధ్యామయూఖచ్ఛటోన్మార్జ
నోద్దామధామాధిపా! త్రిస్తదైత్యేంద్రవక్షస్తటీపాటనాకుంఠభాస్వ
న్నఖశ్రేణిపాణిద్వయస్త్రిస్త విస్తారిరక్తార్ణవామగ్నలోకా! త్రిలోక
ద్విషత్త్రైకూటభోద్దండకంఠాస్థికూటస్ఫుటోన్మార్జితోద్దామ చక్రిస్ఫుర
జ్జ్యోతిరుల్లాసితోద్దామ రోద్దండదోర్దండ! ఖండేందుచూడప్రియా!
ప్రోథదోర్దండవిభ్రాంతమంథాచలక్షుబ్ధదుగ్ధాంబుధి ప్రోత్థితశ్రీభుజా
వల్లిసంశ్లేష సంక్రాంతపీన స్తనాభోగపత్రావళీలాంఛితోరస్స్థలా!
స్థూలముక్తాఫలోదారహారప్రభామండల ప్రస్ఫురత్కంఠ! వైకుంఠ!
సద్భక్తసందోహసంసార మోహచ్ఛిదంబైన బోధోదయం బిమ్ము నా
కో మహాదేవ! దేవా! నమస్తే నమస్తేనమః॥

(అని సాష్టాంగప్రణామము చేసి బయలు దేఱి చూచి) మంచిది! ఇదియే మనకు నివాసార్హమయిన ప్రదేశము. ఇక్కడనే మనసేనలను విడియించెదను.

(అని యుద్ధమును నిష్క్రమించుచున్నారు)

పంచమాంకము

[అప్పుడు శ్రద్ధ ప్రవేశించుచున్నది]

శ్రద్ధ—(ఆలోచించి) ఈవిధము సుప్రసిద్ధమయినదే కదా!

గీ. జ్ఞాతివైరంబువలనను సంభవిల్లు
క్రోధశిఖ నిర్దహించును గులము నెల్లఁ;
ఘనసమీరాహతమహీజఘట్టనమునఁ
గలుగుదహనంబు వనమెల్లఁ గాల్చునట్లు.

(కన్నీరు విడుచుచు) అక్కటా! దారుణమయిన సోదరమరణము వలనఁ గలిగిన శోకానలము దుర్వారమయినదిగా నున్నది. అది వివేకమేఘశతములచేత నయినను జల్లారదు. ఎట్లన—

చ. స్థిరగురువస్తువుల్ గిరులు సింధువులు న్నదులున్ నశింపఁగా,
నరు లన నెంత, యుబ్బులు కన త్తృణకల్పులు మృత్యుదృష్టికిన్!
పొరిఁబొరి బంధుదుఃఖభవమోహ మదేదొ వివేకమార్పఁగా,
నెరియుచు శోకవహ్నిదహియించెడుఁ జిత్తము నట్టులయ్యునున్.

క్రూరస్వభావు లయినను గామక్రోధాదులగు సోదరులు కథాశేషులగుటవలన నాగతి యిట్లయినది.

క. భీకరశోకాగ్నిశిఖా
సీకము శిథిలములొనర్చు నెఱఁకుల నెల్లన్;
బైకొలుపు దేహశోషముఁ;
బ్రాకటముగ నంతరాత్మ వడిగ దహించున్.

(ఆలోచించి) "బిడ్డా! శ్రద్ధా! నేనిక్కడనుండి హింసాప్రధానమయిన యుద్ధమును జూడలేను. కాఁబట్టి నేనీ కాశికాపురమునువిడిచి సాలగ్రామ మను పేరుగల విష్ణుక్షేత్రమునందుఁ గొంతకాలము గడపెదను. నీవక్కడకువచ్చి వృత్తాంతమును జరిగిన క్రమమున నాకు నివేదింపుము" అని విష్ణుభక్తిదేవి నాకాజ్ఞాపించినది. కాఁబట్టి యా దేవిసన్నిధానమునకుఁబోయి యీసమరవృత్తాంతము సర్వమును నేనామెకు విన్నవించెదను. (ముందుకు నడిచి చూచి) ఇది యాచక్రతీ

ర్థము, ఇందుసంసారసాగరోత్తారకమయిన నావకుఁగర్ణధారుఁడైన భగవంతుఁ డగు శ్రీహరి ప్రత్యక్షముగా వాసము చేయుచున్నాఁడు. (ప్రణమిల్లి) ఇదిగో మునులచే నుపాస్యమానురాలైనవిష్ణుభక్తిదేవి శాంతితో నేదో యాలోచించుచున్నది. నే నామె సమీపమునకుఁ బోయెదను. (అని ముందుకు నడుచుచున్నది.)

[అంతట విష్ణుభక్తియు శాంతియుఁ బ్రవేశించుచున్నారు.]

శాంతి—అమ్మా! మీరు ప్రబలచింతాకులహృదయ లయి యున్నట్లు కానఁబడుచున్నారు.

విష్ణు—బిడ్డా! మహావీరపరక్షయకర మయిన యీ ఘోర యుద్ధమునందు బలవంతుఁడైన మహామోహునితోఁ బ్రతిఘటించిన పుత్రప్రియుఁడైన వివేకుని వృత్తాంత మేమయినదో తెలియకపోయెనని నామన స్సిప్పుడు డస్వస్థముగా నున్నది.

శాంతి—దేవీ! ఇక్కడ విచారింపవలసినపని యేమున్నది? దేవిగారి యనుగ్రహ మున్నందున, వివేకమహారాజునకు విజయము నిశ్చయ మని నే నెఱుఁగుదును.

విష్ణు—బిడ్డా!

క. ఘనధర్మపక్షబలమున
ననివార్యంబుగ లభించు నభ్యుదయంబుల్;
విను మట్లయ్యును, సుహృత్కుల
మన సెపుడు నపాయశంక మఱిమఱిఁ బూనున్.

అంతేకాక శ్రద్ధ యింతతడవు రాకుండుట మనస్సునకు సందేహము పుట్టించుచున్నది.

శ్రద్ధ—(సమీపమునకుఁ బోయి) భగవతీ! ప్రణమిల్లుచున్నాను.

విష్ణు—శ్రద్ధా! నీవు క్షేమముతో వచ్చితివా?

శ్రద్ధ—దేవిగారి యనుగ్రహమువలన.

శాంతి—అమ్మా! ప్రణామము చేయుచున్నాను.

శ్రద్ధ—పుత్రీ! నన్నాలింగనము చేసికొమ్ము.

శాంతి—(తల్లిని కౌఁగలించుకొనుచున్నది)

శ్రద్ధ—బిడ్డా! విష్ణుభక్తి దేవిప్రసాదముచేత మునిజనమనో నివాసమును బొందుము.

విష్ణు—అక్కడ నేమిజరిగినది?

శ్రద్ధ—దేవిగారికిఁ బ్రతికూలముగాఁ బ్రవర్తించువారికిఁ దగినట్లు జరిగినది.

విష్ణు—అవి సవిస్తరముగాఁ జెప్పుము.

శ్రద్ధ—దేవీ! అవధరింపుము. దేవి యట్లాదికేశవాలయము నుండి వెడలఁగానే తనపాటలవర్ణముఁ గొంచెము విడిచి సూర్యుఁడు ప్రకాశించుచుండఁగా విజయఘోషాహూయమానానేకవరవీరబహుళసింహనాదబధిరితదిగంతంబునుసతతరథతురగఖరతరఖురఖండితభూమండలోచ్చలద్విపులరజఃపటలాంతరితభాస్కరబింబంబుసుప్రబలతరకర్ణతాళాస్ఫాలనోచ్చలత్సమదకరికుంభసిందూరసంధ్యాయమానదశదిశంబును బ్రళయజలధరధ్వానభీషణంబునగువారియొక్కయు మనయొక్కయు సైన్యసాగరము సన్నద్ధమై యున్నప్పుడు వివేకమహారాజు మహామోహమహారాజుకడకు నైయాయిక దర్శనుని దూతనుగాఁ బంపెను. అతఁడుపోయి మహామోహునితో నిట్లనియెను—

మ. చను, విష్ణ్వాలయపుణ్యకాననదీసాన్నిధ్యభక్తాంతరం
గలివాసంబు త్యజించి, మ్లేచ్ఛమహీ కింకన్ భృత్యవర్గంబుతో;

చనకున్నన్, గరవాలదారితభవత్సర్వాంగధారాక్షరత్
ఘనరక్తంబులుత్రాగఁగూఁతలిడునక్కల్ గ్రింగువీమాంసముల్.

విష్ణు—తరువాత, తరువాత.

శ్రద్ధ—దేవీ! తరువాతఁ గోపముచేత వికటలాటతటతాండవితభ్రుకుటియై మహామోహుఁడు—"ఈదుర్ణయపరిపాక ఫలమువివేక ప్రేత మనుభవించునుగాక!"—అని పలికి, తానే మొట్టమొదటఁ బాషండాగమబృందములనుబాషండశాస్త్రసహితముగా యుద్ధమునకు బురికొల్పెను. ఈలోపల మనస్సైన్యముఖమునందు,

గీ. వేదవేదాంగతతు లుపవేదసమితి
స్మృతిపురాణేతిహాసాదు లెలమిఁ గొలువఁ,
జంద్రసమకాంతితో సరస్వతి సరోజ
కర యరుగుచు నిల్చె నాకస్మికముగ వచ్చి.

విష్ణు—తదనంతరము.

శ్రద్ధ—దేవీ! అప్పుడు వైష్ణవ శైవ సౌరాదు లయిన సర్వాగమబృందములును సరస్వతీదేవి సకాశమునకు వచ్చెను.

విష్ణు—అటుతరువాత.

శ్రద్ధ—తదనంతరమున—

శా. మీమాంస, సరస్వతీసతిపుకోపీర్థిఁ రణోత్సాహయై,
ప్రాముఖ్యస్థితి న్యాయకాపిలమహాభాష్యాదిసద్దర్శన
స్తోమంబు లొల్కవంగ, ధర్మముఖయై, శుద్ధాయుతన్యాయదో
ర్భీమాకారణి నిల్చె, దుర్గకరణిఁ, వేదత్రయీనేత్రయై.

శాంతి—స్వభావప్రతిపక్షము లయినయీగమన్యాయశాస్త్రబృందము లొక్కటిగాఁ గలియుట యెట్లు సంభవించినది?

శ్రద్ధ—పుత్రీ!

కం. ఇతరేతరవైరమునఁ
సతముఁ బెలఁగు నేకవంశజాతులు తమకున్
క్షితిలోపల నవమానం
బితరులచేఁ గల్గుచోట నేకము గారే!

వేదప్రసూతము లయినమతముల లోలోపల విరోధమున్నను, వేదసంర క్షణముకొఱకును నాస్తికపక్షాధిక్షేపముకొఱకును శాస్త్రసంఘముల కైకమత్యము కలుగును. ఆగమసముదాయములో సహితము విరోధము తత్త్వవిచారులకుఁ గానరాదు. ఎట్లన—

శా. శాంతం బద్వయ మవ్యయం బజము శశ్వద్బ్రహ్మ, మాదత్త్వమ
శ్రాంతం బాగమపంక్తిచే సగుణతన్ బ్రహ్మచ్యుతేశాఖ్యలన్
వంతొప్పన్ బహుధా స్తుతింపఁగఁబడుఁ, నానాగమశ్రేణి సం
క్రాంతంబౌ నొకబ్రహ్మమందునె, సముద్రంబందు నేళ్లున్ బలెన్.

విష్ణు—తరువాత? తరువాత?

శ్రద్ధ—దేవీ! తరువాతనిరువాఁగునందును నిరంతరశరనికర ధారాసంపాతోపదర్శిత దుర్దిను లగు కరితురగరథపదాతులకును నుభయ పక్షయోధజనులకును సంకులసమరంబు సంప్రాప్తంబయ్యెను. అప్పుడు,

మ. ప్రవహించె న్నదు లస్రతోయములుఁ, గ్రవ్యస్ఫారపంకంబులున్
వివిధోద్వ్యఘ్నసకంకరంకనివహాభీలావకీర్ణంబులుఁ,
నవనారాచవిభిన్నహస్తిగిరిశీర్ణభ్రష్టవేగోల్లస
ద్ధవళచ్ఛత్రసమూహహంసములునై తద్యుద్ధరంగంబునఁ.

ఆమహాదారుణసంగ్రామంబునందుఁ బరాపరపక్ష విరోధిత్వముచేతఁ బాషండాగమబృందమును ముందుంచుకొని వచ్చిన లోకాయతికతంత్రసముదాయ మన్యోన్యసైన్య విమర్దనముచేత వినష్టమయ్యెను;

అనంతరము పాషండాగమజాలము పర్యాకుల మగుటచేత సదాగమసాగరప్రవాహముచేత, గొట్టుకొనిపోయెను; తదనంతరము సౌగతాగమసమూదాయములు సింధు గాంధార మగధాంగపారశీకవంగకళింగాదిమ్లేచ్ఛప్రాయదేశములఁ బ్రవేశించెను; పాషండ దిగంబర కాపాలికాద్యాగమసంచయంబులుపామరబహుళంబు లైనపాంచాల మాళవాభీరావర్తసాగరానూపదేశములయందు నిగూఢముగా సంచరించుచున్నవి; న్యాయాద్యనుగతయైన మీమాంసచేత గాఢప్రహారజర్జరీకృతములైన నాస్తికతర్కసమూహంబులు తమ యాగమసందోహంబులు పోయినదారినే పోయినవి.

విష్ణు—అటుతరువాత?

శ్రద్ధ—అటుతరువాత వస్తువిచారునిచేతఁ గాముఁడు హతుఁడైనాఁడు; శమముచేతఁ గ్రోధపారుష్యహింసాదులు హింసింపఁబడినారు; సంతోషునిచేత లోభ తృష్ణాదైన్యానృతవాద పైశున్యస్తేయపరిగ్రహులు నిగ్రహింపఁబడినారు; అనసూయచేత మత్సరుఁడు జయింపఁబడినాఁడు; పరోత్కర్షసంభావనునిచేత మదుఁడుసంహరింపఁబడినాఁడు; పరగుణాధిక్యునిచేత మానుఁడు ఖండింపఁబడినాఁడు.

విష్ణు—(హర్షముతో) చక్కగా జరగినది. ఇఁక మహామోహునికథ యేమయినది?

శ్రద్ధ—దేవీ! మహామోహుఁడు యోగవిఘ్నసహితుఁడయి యెక్కడనో యడఁగి యుండుటచేత నాతనిజాడ తెలియరాకున్నది.

విష్ణు—అట్లయినచో మహానర్థశేష మింకను నిలిచియే యున్నది. అతఁడు పరిహరణీయుఁడు. ఎట్లన—

క. పరమాదరపరుఁ డగుచుఁ,
స్థిరసంపదఁ గోరు శేముషీమంతుం డెం

దరికేప మగ్ని శేషము
గురుతరఋణ శేష ముంచ గూడదు సుమ్మీ.
ఇఁక మనస్సుయొక్క వృత్తాంతమేమి?

శ్రద్ధ—దేవీ! పుత్రపౌత్రాదిమరణ జాతశోకావేశముచేత నాతఁడును బ్రాణత్యాగము చేయ నిశ్చయించుకొన్నాఁడు.

విష్ణు—(చిఱునవ్వునవ్వి) ఇది యంతయు నిట్లయ్యేనేని మనము కృతార్థతను బొందినారము; పురుషుఁడును బరమానందమును బొందును. అయినను మహాత్ముఁ డయిన యతఁడు ప్రాణత్యాగ మేల జేసికొనును?

శ్రద్ధ—ఉపనిషద్దేవి ప్రబోధోదయముకొఱకు గృహీతసంకల్పురా లయియున్నందున నతఁ డీవిధముగా శరీరముతోఁ జిరకాల ముండఁడు.

విష్ణు—అగుఁగాక! వైరాగ్యోత్పత్తికొఱకు వైయాసికియైన సరస్వతిని నే నాతనికడకుఁ బంపెదను.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

ఇది ప్రవేశకము

[అప్పుడు మనస్సును, సంకల్పుఁడును ప్రవేశించుచున్నారు]

మన—(కన్నీటితో) హా! పుత్రకులారా! ఎక్కడకుఁ బోయినారు? ఒక్కసారి మీ ప్రియదర్శనమిండు. ఓరోరి కుమారులారా! రాగ ద్వేష మద మాన మాత్సర్యులారా! నన్ను గౌఁగిలించుకొండు. నా యంగములు నొచ్చుచున్నవి. అయ్యో! అనాథుఁడను వృద్ధుఁడను నయియున్న నన్నొక్కఁడయిన నాదరింపఁడేమి! ఓయసూ

యాదులైన కన్యకలారా! మీ రెందుఁబోయినారు! ఆశా హింసా
తృష్ణాదులైన కోడండ్రారా! మందభాగ్యుఁడనైన నా కొక్కఁడును
దక్కకుండ దైవహతకుఁడు మిమ్మందఱ నేకకాలమునం దెత్తుకొని
పోయినాఁడు! (తడఁబాటుతో)

మ. తనువెల్లన్విషవహ్నియుట్లలముదున్, దాఁగాల్చెడు న్మర్మముల్
పెనుపొందించెడుఁ దీవ్రవేదనల; మైపెంపెల్ల మర్దించెడున్;
ఘనమోహంబెడఁగూర్చెదున్; వరవివేకంబెల్లఁ బోకార్చెదున్;
మనుమున్ జీవితమున్ గ్రసించెడు, వెసన్ శోకజ్వరంబక్కటా!

(అని మూర్ఛిల్లుచున్నాఁడు.)

సంక—ఓరాజా! తెప్పిఱిలుము.

మన—(తెప్పిఱిల్లి) ఇట్టియవస్థను బొందియున్న నన్ను దేవి యైన పరివృత్తిసహిత మోదార్పకున్న దేమి?

సంక—(కన్నీరువిడుచుచు) దేవా! ఇంకను నీకుఁ బరివృత్తి దేవి యెక్కడిది. ఈ కుటుంబమరణసంజాతశోకానలదగ్ధహృదయయయి యామె గుండెలుపగిలి మృతినొందినదని విన్నాఁడను.

మన—హా! ప్రియురాలా! నాకొక్కప్రియమయిన ప్రతివచనమేలయియ్యవు? కటకటా!

ఉ. దేవిరో! నన్నుఁబాసి మునుత్రిమ్మరవెన్నఁడు స్వప్నమందునున్;
నీ వెడఁబాసియుంటను నేమృతకల్పుఁడనైతి నిత్తఱిన్;
దైవవిచేష్టితంబునను దవ్వయియుండియు నీవు, నేఁ డహా!
జీవముతోడనుండెద; నిసీ! యసురుల్ కరమున్ దురంతముల్.

(అని మరల మూర్ఛపోవుచున్నాఁడు.)

సంక—ఓరాజా! ఊఱడిల్లుము, ఊఱడిల్లుము.

మన—(తెలివి తెచ్చుకొని) ఇఁక నాకు జీవితాశ చాలును,

ఓసంకల్పా! చితిఁ బేర్చుము. ఇప్పుడు నేనగ్ని ప్రవేశముచేత శోకానలము నార్చుకొనియెదను. (అని సన్నాహపడుచున్నాఁడు.)

[అప్పుడు వ్యాససరస్వతి ప్రవేశించుచున్నది.]

సర—"సఖీ! సరస్వతీ! అపత్యమరణఖిన్నుఁడయి యున్న మనస్సుయొక్క ప్రబోధముకొఱకుఁ బొమ్ము. అతనికి వైరాగ్యోత్పత్తి యెట్లు కలుగునో యట్లు చేయుము" అని భగవతియైన విష్ణుభక్తి దేవి నన్నుఁ బంపినది. కానిమ్ము. నేనిప్పు డాతని సన్నిధికేపోయెదను. (సమీపమునకుఁ బోయి) వత్సా! ఈవిధముగా నీ వతిపరితాపము నేల పొందెదవు? పదార్థము లనిత్యములని నీకీవఱకుఁ దెలిసినదేకదా! ఇతిహాసములను, ఉపాఖ్యానములను, నీ వీవఱకుఁ జదివినవే.

చ. అరయవిరించి యింద్రుఁడు సురాసురులుఁ బ్రముఖ్యులున్మునుల్
ధరణియు వార్ధు లిట్టివగులతులు కల్పశతాయువు ల్తెగన్,
బొరసెద రార శోకకరమోహము! స్త్రీయులబుద్బుదోపమా
స్థిరతనుసంహతుల్ తెగి నశించినయప్పుడు మూఢులేమనన్?

కాఁబట్టి పుట్టినపదార్థములయనిత్యత్వమును భావించుకొమ్ము. నిత్యానిత్యవస్తుదర్శి యగువానిని శోక మంటదు.

గీ. బ్రహ్మ మొక్కటియే సత్యవస్తు వగుచు
నిరతమెల్ల వికల్పిత మెప్పు డగునొ,
యప్పు డేకత్వమును జూచు; నట్టివాని
కెక్కడివి మోహశోకంబు లెంచిచూడ?

మన—భగవతీ! శోకావేగదూషితమయి యున్నానామనస్సునం దిప్పుడు వివేకమునకే యవకాశము లేదు.

సర—వత్సా! ఇది స్నేహదోషము. స్నేహము సర్వానర్థమూలక మన్నయీయర్థము సుప్రసిద్ధమే కదా!

మ. ప్రియనామంబునఁ గ్లేశదుర్విషలతాబీజంబుల న్నాటఁగాఁ,
బయికిన్ స్నేహమయాంకురంబు లడఁగున్ వజ్రాగ్నిగర్భంబులై;
బయలం బ్రాఁకుచు శోకవృక్షములిటుల్ బహ్వార్తిశాఖాశిఖల్
దయివారన్ శతముల్ తుషాగ్నిగతి మెల్లంగాల్చు దేహంబులన్.

మన — దేవీ! ఇది యంతయు సత్యమే. అయినను శోకానల దగ్ధుఁడ నయిన నేను ప్రాణములు నిలుపుకొనుటకు శక్తుఁడను గాకున్నాను. అంత్యకాలమునందు మీదర్శన మగుట మేలయినది.

నర — ఓయీ! ఈయాత్మహత్యాప్రయత్నము మిక్కిలి యకృత్యము. అంతేకాక యీయుపకారులనిమిత్తము నీకీ వేగిరపా టేల! ఆలోచించి చూడుము—

చ. ధరపయి వెన్క ముం దిపుడు దారసుతాదిపరిగ్రహంబు చేఁ
బురుషసుఖార్థమై కలుగఁబోవదు మేలది నీకు నేరికిన్;
మరణమునొంది వారెపుడు మర్మవిభేదమొనర్తు రార్తిచేఁ
నరు లటులయ్యుఁ గాంతురు ఘనశ్రమ వర్థముగాఁ దదర్థమై.
చ. కటకట! వారికై శతులు గాంచనకష్టము లేని యీభువినిన్!
పటుగతి నెన్నికొండ లెగఁ బ్రాఁకరు? వాఁకలదాఁట రెన్నిటన్?
దటుకున నెన్ని ఘోరవిపినంబులు ద్రొక్కరు? విత్తమత్తులన్
కుటిలవివర్ణవక్త్రిలను క్షుద్రనరేశులఁ జూడ రెందఱో!

మన — దేవీ. ఇది నిశ్చయమే అయినను.

క. తనవలనఁ బుట్టి లాలన
మనయంబును గనుచు మనసునందే యెపుడున్
మనియెడువారలఁ బాయుట
తనప్రాణముపోకయట్ల తలకొల్పు వ్యథన్.

సర—వత్సా! ఈవ్యామోహము మమకార వాసనామూలమయినది.

గీ. ఇంటికోడిని మార్జాల మీడ్చి తెచ్చి
మ్రింగునప్పుడు కలిగెడు మేటిశోక
మెలుకనో పిచ్చుకనో భుజియించునప్పు
డొదవమి తలంప మమత లేకున్కిఁ గాదె?

కాఁబట్టి సర్వవిధములచేతను సర్వానర్థబీజ మయినమమత్వమును రూపుమాపుప్రయత్నము చేయవలయును. చూడు—

చ. జననమునొందు దేహమున జంతువు లెన్నియొ మర్త్యకోటికిన్;
తనువుననుండి యత్నమునఁ దాను వెలార్చును నందుఁ బెక్కిటిన్!
విను మిఁక నందు బిడ్డలని పేరిడి కొన్నిటికిన్, దదర్థమై
దినమును గష్టపెట్టు నిజదేహము లోకము మోహ మేమనన్?

మన—దేవీ! అది యట్లేయగునుగాక! అయినను మమత్వగ్రంధి దురుచ్ఛేదమయినది. కాఁబట్టి యీసంగతిని దేవిగారు దృఢముగా మనసునం దుంచుకొనవలెను.

క. నిరతాభ్యాసదృఢీకృత
పరమస్నేహోరుసూత్రపరిగుంభితని
ష్ఠురమమతాపాశం బే
వెరపున నేడుతుఁ నరులు విడిపించుకొనన్?

సర—వత్సా! పదార్థములయొక్కయనిత్యతాభావనమే మమత్వచ్ఛేదమునకుఁ బ్రధమోపాయము.

మ. చనలేదే బహుకోట్లు నీకిటు మహాసంసారమం దెందఱో
జననుల్ తండ్రులు తాతలాత్మభవులున్ జాయల్ పితృవ్యుల్ గనున్;

విను మల్హాట, సుహృత్తులెల్లఁ బుడమిన్ విద్యుత్ప్రకాశాభజీ
వనులంచుం దలపోసిపోసి మదిలో భాస్వత్సుఖం బందుమా.

మన—భగవతీ! నీప్రసాదమువలన నావ్యామోహము పోయినది. కాని,

గీ. త్వన్ముఖశశాంకదీధితిప్రభవమైన
నిర్మలోపదేశామృతనిర్ఝరమున
క్షాళితం బయ్యె, మరల నాస్వాంత మకట!
మలిన మయ్యెడు శోకోర్మ్యు లలముకతన.

కాఁబట్టి భగవతీ! ఈతడియాఅనిశోకవ్రణములు మానుట కేదైన మందుగలదేమో యానతిమ్ము.

సర—వత్సా! దానినీవఱకుమునులుపదేశించియే యున్నారు.

గీ. బాణపాతంబు లేకయె ప్రభవ మొంది
భీక రార్ద్రింబులై మర్మభేదులైన
గాఢశోకప్రహారసంఘాంతములకు
నరయఁగ నచింతయే పరమౌషధంబు.

మన—భగవతీ! అదిసత్యమే. అయినను జిత్తము దుర్వార మయినది. ఎట్లన—

గీ. ఒక్కచింతను మరలింప, నోలి మదిని
గదిసి చింతాపరంపరల్ కప్పివేయుఁ;
బల్మఱును వాతధూతాభ్రపటల మడరి
యిందుబింబంబు గప్పి మాయించునట్లు.

సర—చిత్తమున కీవికాశమున్నదే! అట్టిచోఁ జిత్తము నొక శాంతవిషయమునందుఁ బ్రవేశ పెట్టవలయును.

మన—భగవతీ! ఆశాంతవిషయమేదో ప్రసాదింపుము.

సర—వత్సా! అది రహస్యమైనది. అయినను శోకార్తుల కుపదేశించుటలో దోషము లేదు.

చ. స్థిరమతి నీలనీరధర దేహుని శ్రీహరి నొండెఁ, గామసం
హారు వనజారిఖండధరు నాహరు నొండెఁ, దలంపు; లేనిచో,
నిరతిని గ్రీష్మవేళ వలినీటికొలంకును బోలె నాత్మ స
ప్పురము నిర స్తశోకమును బ్రహ్మముఁ జొప్పిభజించు నిర్వృతిన్.

మన—(ఆలోచించి నిట్టూర్పుతో) సర్వవిధములచేతను నేను దేవిగారిచేత రక్షింపఁబడినాఁడను.

(అని పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

సర—వత్సా! నీహృదయమిప్పటి కుపదేశమయినది. కాఁబట్టి నీకు మఱియొకటికూడ నుపదేశించెదను.

మ. జనకుండో సుతుండో తనువుం జాలింప, ధీశూన్యులి
మ్మనశోకాగ్నిఁ దపింతురెంతయు నురమ్ముల్మోఁదుకొంచొక్కటన్
కన సంసార మసారమంచు శమసౌఖ్యంబుం గడుం బెంచుచున్
ఘనధీమంతుల కావి యోగచయమే కల్గించు వైరాగ్యమున్.

[అప్పుడు వైరాగ్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

వైరా—(ఆలోచించి)

మ. నవనీలోత్పలకోమలచ్ఛదముకన్నన్ సూక్ష్మమౌత్వక్కు మా
నవదేహంబులపై విధాతృఁడిటు నిండ న్మాయకున్నన్, సదా
స్రవదస్రాంబువిమిశ్రమాంసవిసరగ్రాసాగతధ్వాంక్షగృ
ధ్రవృకశ్వాసములన్ మరల్పఁగను సాధ్యంబౌనె యెవ్వారికిన్?

మఱియును.

మ. తటిదాలోలము కల్మిజాలము: రుజోద్యద్దేహము ల్దేహముల్;
స్ఫుటసంభోగరసంబు లంతవిరసంబుల్; లోకముల్ శోకముల్;

ఘటితాంచద్ధనము ల్మహానిధనముల్; వామ ల్విపత్సీమ, ల
క్కట! యట్లయ్యుఁ, జరింతు రాత్మనిరతు ల్గా కీడుపంథాజనుల్.

సర—వత్సా! ఇదె వైరాగ్యుఁడు నీదగ్గఱకువచ్చుచున్నాఁడు. ఈతనిని గారవింపుము.

మన—నాపుత్రుఁడు వైరాగ్యుఁడా?

వైరా—(సమీపమునకుఁ బోయి) అయ్యా! నేను నమస్కారము చేయుచున్నాను.

మన—వత్సా! పుట్టఁగానే నీవు నన్ను విడిచిపోతివి. నన్నుఁ గౌఁగిలించుకొమ్ము.

వైరా—(ఆలింగనము చేయుచున్నాఁడు.)

మన—పుత్రా! నిన్నుఁ జూచుటవలననే నాశోకావేశము ప్రశాంత మయినది.

వైరా—ఓతండ్రీ! ఇక్కడ శోకావేశమున కవకాశ మెక్కడ నున్నది?

ఉ. వారిని బాంధు, లేటివఱదన్ దరుకాండము, లాకసంబునన్
వారిదముల్, సముద్రమున నావికులున్, వడిఁగూడిపాయు న
ట్లారయఁ దల్లిదండ్రులును నాత్మజులున్ సఖులున్ సహోదరుల్
చేరుచుఁ బాయుచుండు టిది సిద్ధము; ప్రాజ్ఞుల కేడ శోకముల్?

మన—(ఆనందముతో) దేవీ! నాకుమారుండు చెప్పిన దిది యదార్థమే.

చ. అలసవయోవనల్ లలన, లాయువినాడలసత్కుజవ్రజం,
బలసవమల్లికాసురభిశానిలకందళముల్, తలంప ని
ర్మలను వేకమూర్జితతమంబగు మన్మతి కిప్డు డెండమా
వుల జలమట్లు మిథ్యలయిపోల్పఁజితోఁ చెడుఁ దొంటివన్నియున్.

సర—వత్సా! ఇది యంతయు సత్యమేయయినను గృహస్థుఁడాశ్రమధర్మమును విడిచి ముహూర్తకాల మయిన నుండఁగూడదు. కాఁబట్టి నేఁడు మొదలుకొని నివృత్తిదేవియే నీకు సహధర్మచారిణి కాఁగలదు.

మన—(లజ్జతో) దేవియాజ్ఞకు బద్ధుఁడను.

సర—శమదమసంతోషాదు లయినపుత్రులు నీ కుపచారములు చేయుదురు; యమనియమాదులు మంత్రు లగుదురు; వివేకుఁడును నీయనుగ్రహమువలననే యుపనిషద్దేవితోఁడఁగూడి యావద్రాజ్యసుఖ మనుభవించునుగాక! మైత్రి మొదలయిననీతోఁబుట్టువులు నలువురును నీయనుగ్రహముకొఱకు భగవతియైన విష్ణుభక్తిదేవిచేతఁ బంపఁబడినారు. వారిని బ్రసాదపూర్వకముగా నంగీకరింపుము.

మన—దేవి యాజ్ఞాపించినట్లు చేసెదను. మీయాజ్ఞల సన్నిటిని శిరసావహించినాఁడను. (అని హర్షముతోఁ బాదప్రణామము చేయుచున్నాఁడు.)

సర—ఈయమనియమాసనప్రాణాయామాదులును జిరంజీవివైన నీచే నాదరపూర్వకముగాఁ జూడఁదగినవారు. వీరితోఁగూడి నీవుసామ్రాజ్య మధిష్ఠింపుము. నీవు స్వాస్థ్యమును బొందినప్పుడు జీవాత్ముఁడును దనప్రకృతిని బొందును.

మ. రవిబింబంబు పయోధివీచులబలెన్, బ్రహ్మంబొకం డయ్యుసం
భవనాశాదులుపొందితోఁచు బహుతన్ ద్వాత్సంగతిన్ వృత్తులన్;
దిపుటన్ వృత్తు లడంచి నీవిఁక నివృత్తిం గూడితే, నాత్మయున్,
రవిబింబం బురుదర్పణంబునబలెన్, హార్దైకతాచ్ఛం బగున్.

కానిమ్ము. జ్ఞాతుల కుదకప్రదానము చేయుటకొఱకు మనము నదికి బోవుదము.

మన — దేవి సెలవిచ్చినట్లు చేయుదము.

(అందఱును నిష్క్రమించు చున్నారు.)

షష్ఠాంకము.

[అప్పుడు శాంతి ప్రవేశించు చున్నది.]

శాంతి — "పుత్రీ! నీకంతయుఁ దెలిసిన దేకదా!

చ. కొడుకులు పంచతం గనఁగ, గూఢముగాఁజని మోహుఁ జేడనో
యుడఁగుటచే విరక్తుఁడయి యుల్లమనస్సు ప్రశాంతి నొందఁగా,
వడిగను క్లేశపంచకము పాయుటచేఁ బురుషుండు నొక్కటన్
గడుకొని తత్త్వబోధమునఁ గాంతుఁడయొనర్చెడు నెల్లయప్పుడున్.

కాఁబట్టి నీవతిత్వరితముగా నుపనిషద్దేవి ననునయించినాసమ్ముఖమునకుఁ దీసికొనిరమ్ము" అని వివేకమహారాజుగారు నాతో సెలవిచ్చినారు. (చూచి) ఇదిగో తనలోఁ దా నేదో సంతోషముతో నాలోచించుకొనుచు నాతల్లి యీవంకనే వచ్చుచున్నది.

[అంతట శ్రద్ధ ప్రవేశించు చున్నది.]

శ్రద్ధ — ఓహో! రాజకుల మారోగ్యమును బొందఁగాఁజూచి యిప్పుడుగదా చిరకాలమునకు నాకన్నులమృతరసపూర్ణములయినవి.

గీ. కలిగె ఖలనిగ్రహము రాజకులమునందుఁ;
బూజ్యులైరి శమాదిసత్పురుషులెల్ల;
జీవులెల్లను వశ్యులై సేవచేయు,
నెసఁగుచున్నాఁడు సర్వలోకేశ్వరుండు.

శాంతి—(చేరఁబోయి) అమ్మా! నీవు నిలుచుండి యేమి యాలోచించుచున్నావు?

శ్రద్ధ—బిడ్డా! రాజకుల మారోగ్యమును బొందఁగా జూచి చిరకాలమున కిప్పుడుగదా నాకన్ను లమృతరసపూర్ణము లయినవి!

గీ. కలిగె ఖలనిగ్రహము రాజకులమునందుఁ;
పూజ్యులైరి శమాదిసత్పురుషు లెల్ల;
జీవులెల్లను వశ్యులై సేవచేయ,
నెసఁగుచున్నాఁడు సర్వలోకేశ్వరుండు.

(అని మరలఁ బఠించుచున్నది.)

శాంతి—ఇప్పుడు మనస్సువిషయమున స్వామియైన పురుషుని ప్రవర్తన మెట్లున్నది?

శ్రద్ధ—వధ్యునివిషయమునను నిగ్రాహ్యుని విషయమునను నెట్లుండవలయునో యట్లున్నది.

శాంతి—అట్లయిన, స్వామియే సామ్రాజ్యము నలంకరించునా యేమి?

శ్రద్ధ—దానికి సందేహమేమి? ఆత్మానుసంధానము చేసిన యెడల, స్వామియే స్వారాట్టును సమ్రాట్టును నగును.

శాంతి—ఇఁక జీవేశ్వరునకు మాయయం దెట్టియనుగ్రహము గలదు?

శ్రద్ధ—నిగ్రహమని చెప్పవలెను. అనుగ్రహ మెట్లుశక్యమగును? పురుషుఁ డిప్పుడు సర్వానర్థబీజభూత యయిన యామాయ సర్వథా నిగ్రాహ్యురాలని తలఁచుచున్నాఁడు.

శాంతి—అట్లయినపక్షమున, రాజకులముయొక్కస్థితి యిప్పుడెట్లున్నది?

శ్రద్ధ—వినుము. పురుషునకు—

శా. నిత్యానిత్యవిమర్శ యిష్టసతి; సన్మిత్రుండు వైరాగ్యఁ; డా
త్మాత్యంతాగ్రహితుల్ యమాదులు; సహాయాప్తు ల్శమాదు త్త [ముల్
మైత్ర్యాదు ల్పరిచారికల్; సహచరీమత్తల్లి మోక్షేచ్ఛ; దు
ష్కృత్యుల్మోహమమత్వముఖ్యరిపులుచ్ఛేద్యుల్ప లాత్కారతన్.

శాంతి—మఱి ధర్మునియెడల స్వామి కెట్టి ప్రీతికలదు?

శ్రద్ధ—పుత్రీ! వైరాగ్యసన్నికర్ష మయినది మొదలుకొని స్వామి యిహపరఫలభోగములయందు నితాంతమును విరసుఁడయియే యున్నాఁడు. అందుచేత నే యతఁడు

గీ. నరకహేతువౌ పాపంబునకును బోలె,
నశ్వర మని పుణ్యఫలంబునకును వెఱచు;
శుద్ధనిష్కామతను జేయుసుకృతకర్మ
మునకు నెట్టులో తా నియ్యకొనుచు నుండు.

ఇట్లు స్వామియాత్మైకనిష్ఠుఁడయి యుండుట కనిపెట్టి ధర్ముఁడు తాను గృహకృత్యుఁడయిన ట్లెంచుకొని తనకుఁ దానే దనవ్యాపారమును వదలుకొన్నవాఁ డయ్యెను.

శాంతి—అప్పుడు యోగవిఘ్నులను వెంటఁగొని మహామోహుఁ డదృశ్యుఁ డయ్యెనే, వారి వృత్తాంత మేమి?

శ్రద్ధ—పుత్రీ! అట్టి దురవస్థను బొందినవాఁ డయ్యెను; మహామోహహతకుఁడు స్వామిని మోసపుచ్చుట కయి మధుమతి యనువిద్యతోఁ డఁగూడ యోగవిఘ్నులను బంపెను. స్వామి వారి యందుఁ దగులుకొన్నయెడల, వివేకుఁ డుపనిషచ్చింతనైనను జేయకుండునని వానియభిప్రాయము.

శాంతి—ఔరా! తరువాత? తరువాత?

శ్రద్ధ—తరువాత వారుపోయి స్వామికొక యైంద్రజాలికవిద్యను జూపిరి. వారొక యత్యాశ్చర్యకరరూపమును జూపి సంభ్రమముతో నిట్లనిరి. ఓస్వామీ!

చ. అచిరముగా నితండు విను నభ్రిపడన్ శతయోజనధ్వనుల్;
పఠియము చేయు మున్వినని భారత వేదపురాణగాథలన్;
రచనయొనర్చు శుద్ధపదరమ్యత స్వేచ్ఛను గావ్యశాస్త్రముల్;
ఖచరగతిం జరించును జగంబుల; మేరుమణిస్థలు ల్గనున్.

అతఁడు మధుమతీవిద్య చేతఁ గల్పింపఁబడిన ప్రదేశమును జేరఁగా స్థానాభిమాన దేవత లాశపుట్టునట్లుగా నిట్లనిరి.—అయ్యా! ఇందుఁ గూరుచుండుము; ఇక్కడ జననమరణములు లేవు; ఈప్రదేశము సహజసుందర మయినది: వివిధవిలాస వేషలావణ్యవతులును బుణ్యమయులును మంగళార్ఘ్యవ్యగ్రపాణులును బ్రణయకృత్యచతురులును నగువిద్యాధర కాంతలు వీరెసీయొద్దనున్నారు. కాఁబట్టి యిటురమ్ము.

గీ. కనకసికతిలస్థలములు గలుగునదుల,
ఘనజఘనలు వరోరులా కమలముఖుల,
మరకతదళమృదువనాళిఁ బొరయు మీవు
పుణ్యసముపార్జితాఖిలభోగములను.

శాంతి—అటుపిమ్మట?

శ్రద్ధ—పుత్రీ! ఆమాటలువిని మాయ యిది శ్లాఘ్య మయినదని చెప్పెను; మనస్సును మోదించెను; సంకల్పుఁడును బ్రోత్సాహపఱిచెను; స్వామి యంగీకారమార్గమును బొందినవానివలెనుండెను.

శాంతి—(ఖేదముతో) అయ్యో! స్వామి మరల సంసారవాగురలోఁ దగులుకొనుచున్నాఁడు!

శ్రద్ధ—లేదు. లేదు.

శాంతి—ఆవల నేమిజరగినది?

శ్రద్ధ—అప్పుడు పార్శ్వవర్తియైన తర్కుఁడు వారినందఱిని క్రోధావేశకషాయితలోచనుఁడయి చూచి, స్వామినిగూర్చి యిట్లని యెను:—"ఓస్వామీ! విషయామిషగ్రాసాభిలాషులును సభాప్రతారణధూర్తబకులును నైన వీరిట్లు నిన్నుమరల దుస్సహవిషయాగ్ని జ్వాలలయందుఁ బడఁద్రోయుచుండఁగాఁ దెలిసికోలేకున్నా వేమి?

క. భవసాగరముం దాఁటఁగ

నవలీలం బ్రాప్తమైనయులయోగతరిన్

దవుల విడనాడి వెస నివు

డవగాహన మేల చేసె దంగారనదిన్?"

శాంతి—అటుతరువాత?

శ్రద్ధ—అప్పు డాతనిమాటవిని, 'విషయసుఖములకు నమస్కార' మని పలికి, పురుషుఁడు మధుమతిని దిరస్కారము చేసెను.

శాంతి—మేలు! మేలు! నీవిప్పు డెక్కడకు బయలుదేఱి నావు?

శ్రద్ధ—"నేను వివేకుని జూడఁగోరుచున్నాను. కాఁబట్టి నీ వాతనిని శీఘ్రముగాఁ గొనిరమ్ము" అని స్వామి నాకాజ్ఞయిచ్చెను. కాఁబట్టి నేనిప్పుడు మహారాజసన్నిధికి బయలుదేఱినాను.

శాంతి—నాకును మహారాజుగా రుపనిషద్దేవిని దీసికొనిరమ్మని యాజ్ఞయిచ్చినారు. ఔఁగాక! మనము స్వామినియోగమును నెఱవేర్తము,

(అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు)

ఇది ప్రవేశకము

[అప్పుడు పురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు]

పురు—(ఆలోచించి హర్షముతో) ఓహో! ఏమి యీవిష్ణుభక్తిదేవిమాహాత్మ్యము! ఆమెయనుగ్రహముచేత నేను—

మ. వడిఁ గ్లేశోర్ము లతిక్రమించి, మమతావర్తంబులన్ దాఁటితిన్;
కడకున్ మిత్రకళత్రబంధుమకరగ్రాహంబులన్ ద్రోలితిన్;
జెడఁగా నార్చితిఁ గ్రోధబాడబశిఖిన్; దృష్ణాలతల్ ద్రెంచితిన్;
కడు సంసారసముద్రతీర మిపు డేఁ గంటిన్ సమీపింపఁగన్.

[అంతట నుపనిషద్దేవియు శాంతియుఁ బ్రవేశించుచున్నారు]

ఉప—సఖీ! అట్లు నిర్దయుఁడయి యుండినభర్తయొక్క ముఖమును నే నెటు చూడఁగలను? ఆతనిచేత నేను చిరకాలము పరదారవలె విడిచిపెట్టఁబడి యేకాకినిగయి యుంటిని.

శాంతి—దేవీ! ఆవిధముగా నాపదలపాలయినభర్తగారి నేల నిందించెదవు?

ఉప—సఖీ! ఇట్లు చెప్పెదు నీ వప్పటినాకష్టదశను జూడలేదు. వినుము—

చ. అకట! వివేకుఁ డట్లు విధియత్నమున్ నను దవ్వొనర్చుటన్;
సకలఖలుల్ కుబుద్ధిమెయి నన్ దమదాసిగఁ జేయ నీడ్వఁగా
శకలములై మణుల్సడల జంకి చెడెం గరకంకణావళుల్;
ప్రకట శిరోమణుల్గొనఁగ లాగుటచేఁ దెగెఁ గేశపాశముల్.

శాంతి—సఖీ! ఇది యంతయు నామహామోహుని దుర్విలసితము. ఇందు భర్తగారి యపరాధ మేమియు లేదు. వానిచేత నేమనస్సు కామాదులద్వారమున మోహపెట్టఁబడుటచే వివేకుఁడు నిన్నుండి దూరము చేయఁబడినాఁడు. ఇట్లువిపన్నుఁడయిన నిజవల్లభుని సమయముప్రతీక్షించియుండుట కులస్త్రీలకు నైసర్గికశీలము. కాఁబట్టి

నీవువచ్చి దర్శనముచేతను ప్రియాలాపముచేతను భర్తను సంభావింపుము. ఇప్పుడు శత్రులు హతముచేయఁబడినారు; నీమనోరథములు సంపూర్ణములయినవి.

ఉప—సఖీ! నే నిప్పుడిట వచ్చునప్పుడు నాకూఁతురైనగీతాదేవి రహస్యముగా 'స్వామియైన పురుషుఁడును భర్తయు నన్నిడిగిన ప్రశ్నల కుత్తరములు చెప్పి నీవువారిని సంభావింపవలయును; తన్మూలమునఁ బ్రబోధోత్పత్తి కాఁగలదు'' అని చెప్పినది. నేనెట్లు గురుజనులముందు ప్రాగల్భ్యమును జూపఁ గలను?

శాంతి—దేవీ! భగవతియైన గీతాదేవియొక్క యీవాక్యమునకు విచారింపఁ బనిలేదు. ఈయర్థమునే భగవతియైన విష్ణుభక్తిదేవి వివేకస్వామితోడఁ జెప్పినది. కాఁబట్టి వచ్చి భర్తను, ఆదిపురుషుని, నీదర్శనముచేత సమ్మానింపుము.

ఉప—ప్రియసఖి చెప్పినట్లు చేసెదను.

(అని ముందుకు నడుచుచున్నది)

[అప్పుడు వివేక మహారాజును, శ్రద్ధయుఁ బ్రవేశించుచున్నారు]

వివే—ఓవత్సా! శ్రద్ధా! శాంతి నాప్రియురాలైన యుపనిషత్కాంతను జూచునా?

శ్రద్ధ—దేవా! మీయాజ్ఞను దలఁదాల్చిపోయిన శాంతి యామె నెట్లుచూడకుండును?

వివే—ఎక్కడఁజూచును?

శ్రద్ధ—దేవా! మందరపర్వతమునందు మధుసూదనాలయములో నామె తర్కవిద్యాభయమునఁజేత గీతాదేవిమఱుఁగు చొచ్చియున్నదని యీవఱకే విష్ణుభక్తిదేవి చెప్పినది.

వివే—తర్కవిద్యల కేల భయపడవలెను?

శ్రద్ధ—దేవా! ఈసంగతి మీ కామెయే వివరముగాఁ జెప్పఁగలదు. కాఁబట్టి దేవరవారు విచ్చేయుఁడు. ఇదె పురుషుఁడు మీ యాగమనమునే తలఁచుకొనుచు నొంటిగా నున్నవాఁడు.

వివే—(చేరువకుఁ బోయి) స్వామీ! అభివాదము చేయుచున్నాను.

పురు—వత్సా! ఈశిష్టాచారము ప్రక్రమవిరుద్ధ మయినది. జ్ఞానవృద్ధుఁడ వైననీవే నా కుపదేశదానముచేతఁ బితృభావమును బొందితివి. ఎట్లన—

గీ. మున్ను ధర్మమార్గము తప్పి భూమిసురులు
తనయులను వేఁడుకొని రల్లదారి చూప:
శిష్యులఁగ వారి జ్ఞానంబుచే గ్రహించి,
సుతులు 'సుతులార! వినుఁ' డని పితలాననిరి.

కాఁబట్టి నీవును మాయెడలఁ బితృత్వముచేత వర్తింపవలయును. అదియే ధర్మము.

శాంతి—దేవీ! ఇదె వివేకునితోడఁ బురుషుఁ డొంటిగా నున్నాఁడు. సన్నిధికిఁ బొమ్ము.

ఉప—(సమీపమునకుఁ బోవుచున్నది)

శాంతి—స్వామీ! ఉపనిషద్దేవి యిదిగో మీపాదవందనము చేయ వచ్చి యున్నది.

పురు—అట్లుకాదు. అట్లుకాదు. తత్త్వావబోధోదయముచేత నీమెయే నాకు మాత. కాఁబట్టి నేనేయీమెకు నమస్కరింపవలెను. అంతేకాక,

క. జననికి దేవికిఁ గల దిల
నను గ్రహముఁ జూపుటందు నంతర మెంతో;

జనని భవబంధములఁ గడుఁ
బెనఁచును; బంధముల దేవి విడిపించుఁ గడున్.

ఉప—(వివేకునిఁ జూచి నమస్కరించి దూరముగాఁ గూరుచున్నది.)

పుర—అమ్మా! నీవింతవఱకును దినము లెట్లు గడపితివో చెప్పుము.

ఉప—స్వామీ!

ఉ. పుచ్చితిఁ బెక్కునాళ్ళు ఘనమూర్ఖులతోడను నే మఠంబులన్,
రచ్చల, శూన్య దేవభవనంబుల, వ్యర్థవచఃప్రసంగతిన్.

పుర—మఱి వారు నీచేతఁ దత్త్వము నేమైనఁ దెలిసికొన్నారా?

ఉప—లేదు. లేదు. వారు—
మచ్చిక ద్రావిడాంగనలమాటలకట్లు గ్రహింప కర్థమున్,
జెచ్చెర నస్మదుక్తులకు స్వేచ్ఛ నొనర్చి రపార్థకల్పనల్.

వారికి నావాక్యార్థవిచారమువలని ప్రయోజన మంతయుఁ గేవల పరధనగ్రహణార్థమే.

పుర—తరువాత? తరువాత?

ఉప—తరువాత నేనొక చోట

మ. పరిపూర్ణాజ్యజుహూమృగాజినసమిద్వహ్నిస్రువోపేతమై,
వరసోమేష్టిపశుప్రభృత్యురుమఖవ్రాతోల్లసత్పార్శ్వమై,
నిరతప్రావృతకర్మకాండబహుధానిర్దిష్టమార్గాళియై,
సరసం గ్రుమ్మరుయజ్ఞవిద్యఁ బొడగాంచం గంటి మార్గంబునన్.

పుర—అటుతరువాత?

ఉప—తరువాతఁ బుస్తకభారవాహిని యైనయామెకు నా

తత్త్వ మేమయినఁదెలిసి యుండు నని యెంచి నేనామెసన్నిధిని గొన్నిదినములు గడపవలె నని తలఁచితిని.

పురు—తదనంతరము?

ఉప—తదనంతరము నే నామె సమీపమునకుఁ బోఁగా, "ఓసుమంగళీ! నీకోరిక యేమి?" అని యామె నన్నడిగెను. అమ్మా! నేనిప్పుడనాథనయి యున్నదానను. కాఁబట్టి నీయొద్ద నుండఁగోరుచున్నాను." అని నేను జెప్పితిని.

పురు—అటుపిమ్మట?

ఉప—అటుపిమ్మట "ఓసుమంగళీ! నీవు చేయుపని యేమి?" అని యామె న న్నడిగెను.

పురు—అటు వెనుక?

ఉప—అప్పుడు నే నిట్లంటిని—

చ. ఎవ్వనిలో జగంబు జనియించి రమించి లయించు, నీజగం
బెవ్వనికాంతిచే వెలుఁగు, నెవ్వని తేజము సత్సుఖోజ్జ్వలం,
బెవ్వనిఁగొల్చి ద్వైతతమమేగఁ బునర్భవ మొంద రెప్పుడున్
నెవ్వడిఁ బుణ్యు, లాపురుషు నిత్యుని శాంతు స్తుతింతునక్రియుఁ

అంతట యజ్ఞవిద్య యాలోచించి యిట్లనియెను—

"గీ. అక్రియుఁ డగువా డీశ్వరుం డగుట యెట్లు?
సత్క్రియలుగాని వస్తువిచారబుద్ధి
యరయ భవబంధనాశనకరము గాదు;
జనుఁడు భవనాశకరకర్మ లొనరఁ జేసి
వత్సరశతంబు శాంతుఁడై బ్రతుకఁగోరు.

కాఁబట్టి నేనిన్నుఁ జేకొటవలనఁ బ్రయోజనములేదని తలఁచెదను. అయినను నీవు కర్తయు భోక్తయు నగుపురుషునిఁ బ్రస్తుతిం

చుచుఁ గొంతకాల మిచ్చట వసింపఁగోరెదు పక్షమున నాకాక్షేప మేమియు లేదు."

వివే—ఆహా! ఏమి ధూమాంధకారశ్యామలితనయన యయిన యజ్ఞవిద్యయొక్క దుష్ప్రజ్ఞత్వము! ఆమె యీప్రకారముగాఁ గుతర్కముచేతఁ జెడిపోయినది.

ఉత్సాహ. సహజముగ నచేతనంబు జడము నైన లోహ మి
మ్మహిని జుంబకోపలంబు ముందటం జలించు న
ట్లహహా! మాయ యున్ సృజించు నఖిలలోకములను ని
స్పృహాత విశ్వసాక్షి యైన యీశుదృష్టి ప్రేరణన్.

కాఁబట్టి తమోంధు లయినవారిదృష్టి యీవిధముగానే యుండును. అజ్ఞానసంభవ మయిన సంసారమును గర్మలచేత నశింపఁ జేయఁ గోరెడు యజ్ఞవిద్య నిశ్చయముగా గాఢాంధకారమును సహిత మంధకారముచేతఁ బోఁగొట్టఁబూనును. ఎట్లన—

గీ. నశ్వరములు నజ్ఞానజన్యములు నైన
యేడులోకంబులఁ బ్రకాశ మెవఁ డొనర్చు
నతనిఁ బొందును విబుధాళి మృతిని గెలిచి;
యితర మెట లేదు భవముక్తిహేతుసరణి.

పురు—తరువాత! తరువాత!

ఉప—తరువాత యజ్ఞవిద్య పరల నాలోచించి "ఓసఖీ! నీవిచ్చట నుండుటవలన దుర్బుద్ధిగ్రస్తు లయిన నాశిష్యులు కర్మలయం దాదరము తగ్గినవా రగుదురు. కాఁబట్టి, ఓతల్లీ! నీవు నాయం దనుగ్రహించి నీయిచ్చవచ్చిన దేశమునకు విజయం చేయుము." అనెను.

పురు—పిమ్మట!

ఉప—పిమ్మట నేనామెను విడిచి బయలుదేఱితిని.

పురు—అటుతరువాత?

ఉప—తరువాత కర్మకాండసహచరి యైన మీమాంస నాకుఁ గనబడినది. ఆమీమాంస—

చ. కరమధికారయోగ్యముగఁ గర్మముల న్విభజించి మించి, సు
స్థిరఘనగౌరవంబున శ్రుతిప్రముఖప్రబలప్రమాణముల్
వరుసను వెంటనంటి కొలువన్, సువిచిత్రతరాంగయుక్తయై,
పరఁగఁ, గృతోపదేశమయి భాసిలునయ్యతిదేశరాజితోన్.

పురు—అనంతరము.

ఉప—అనంతరము నేనామెను సహితము పూర్వమువలెనే యాశ్రయమును వేడితిని. అప్పు డామెయు "ఓసుమంగళీ! నీవు చేయుపని యేమి?" అని నన్నడిగెను. అంతట నేను దాంటివలెనే "ఎవ్వనిలో జగంబు జనియించి రమించి లయించు" మొదలుగాఁ గల వాక్యమును జెప్పితిని.

పురు—అవల?

ఉప—అవల మీమాంస పార్శ్వవర్తులముఖమును జూచి "లోకాంతరఫలోపభోగయోగ్యుఁ డైన పురుషుని బ్రతిపాదించుట చేత మన కీమెవలనఁ బ్రయోజనము గలదు. కాఁబట్టి కర్మోపయుక్తయైన యీామెను స్వీకరింపుఁడు" అని పలికెను. అక్కడ వారిలో నొకశిష్యుఁడు దాని ననుమోదించెను. ప్రసిద్ధప్రతిష్ఠుఁడైన కుమారిలస్వామియును మఱియొకఁడు మీమాంసాహృదయాధిదేవతయో యనునట్లుగా "దేవీ! ఈమె కర్మోపయుక్తుఁ డయిన పురుషునిఁ బ్రతిపాదింపదు; కర్తయు, భోక్తయుఁగాని యీశ్వరునిఁ బ్రతిపాదించును. ఈమె కర్మలకించుకయు నుపయోగపడునది కాదు." అనెను.

అప్పు డింకొకఁడు "లౌకికపురుషునికంటె నన్యుఁడయి యీశ్వరుఁడని యొకఁ డున్నాఁడా?" యని యడిగెను. అంత నతఁడు నవ్వి "ఉన్నాఁడు" అని మరల నిట్లనియెను.—

చ. ఒకఁడు కనున్ జగత్క్రియల, నొక్కఁడు మోహయుతాంధబుద్ధియై
నొకఁ డిడుఁ గర్మజాలఫల, మొక్కఁడు తత్ఫలవాంఛఁ జేయుఁ; దా
నొకఁడు శరీరుల న్నడుపు, నొక్కఁడు కర్మములన్నియుక్తుఁడౌ;
నిఁకను విసంగుఁ డౌపరము నెట్లగు, జెప్పఁగఁ గర్మభోక్తఁగన్?

వివే—(హర్షముతో) మేలు! కుమారిలస్వామీ! మేలు! నీవు మంచిప్రజ్ఞ గలవాఁడవు. నీవు దీర్ఘాయుష్మంతుఁడవు కమ్ము.

క. సహవాసులుఁ జెలులును నా
విహగంబులు రెండు నేకవృక్షమె చేరున్;
విహగ మొకటి తిను ఫలముల;
నహహా! రెండవది తినక యాలోకించున్.

పురు—తరువాత?

ఉప—తరువాత నేను మీమాంసవద్ద సెలవు గైకొని వెడలితిని.

పురు—అటుతరువాత?

అప—అటుతరువాత నేను శిష్యులుపలువుండ్రిచేత నుపాస్యమానలైన తర్కవిద్యలను బొడగాంచితిని. అందు,

మ. తెలుపు న్విశ్వవిశేష మో; క్కొకతె వాదించున్ వితండాదృతిన్
లలి జాతిచ్ఛలనిగ్రహాదికమహావ్యాకూళితో జల్పముల్;
పలుచన్ వాకొనుఁ బూరుషప్రకృతిసంభేదంబు లొక్కర్తు, సం
ఖ్యలచే నెన్నుచుఁ దత్త్వముల్ మహదహంకారాదిసర్గంబులున్.

పురు—తరువాత? తరువాత?

ఉప—పూర్వరీతినే నేనును వారిసమీపమునకుఁ బోయి, వా

రడిగినమీఁదట "ఎవ్వనిలో జగంబు జనియించి రమించి లయించు" ఇత్యాది వాక్యముచేత మునుపటియట్లే నాకార్యమును జెప్పితిని. అప్పుడు వారు నన్నుఁ బ్రత్యక్షముగాఁ బరిహసించి "ఓ వాచాలురాలా! విశ్వము పరమాణువులవలనఁ గలుగుచున్నది. ఈశ్వరుఁడు నిమిత్తకారణము" అని పలికిరి. అందొకతె కోపముతో "ఓసి పాపాత్మురాలా! ఈశ్వరునే సవికారునిఁ జేసి వినాశధర్మము నాపాదించుచున్నావేమి!" అనెను. మఱియొకతె "ఓసీ! విశ్వోత్పత్తి ప్రకృతివలనఁ గలిగె"నని పలికెను.

వివే—ఓహో! తర్కవిద్య లెంతదుర్మతులు! ఘటాదికము వలెనే ప్రమేయజాతము సర్వమును గార్యమనిసహిత మింతమాత్రము తెలిసికోఁజాలకున్నారు. పరమాణువులును బ్రకృతియు నుపాదానకారణము లనుటయు నుపేక్షణీయమే.

మ. జలచంద్రుంబలె నంతరిక్షనగరస్వప్నేంద్రజాలంబు ల
ట్లలవిశ్వంబును మిథ్య, మేయమును గార్యంబౌటసాద్యంతతన్;
కలుగున్ శుక్తిని వెండియట్లు శివుగాఁగం దెల్విఁ నన్గానమిన్;
పోలియుఁ స్రక్కనఁబన్నగభ్రమవలెన్ బోధోదయప్రాప్తిచేన్.

ఇఁక వికారశంకయు ముగ్ధవధూమానసవిలసితమే. ఎట్లన—

ఉ. శాంతము నిర్మలంబును నజంబు ననంతము నిష్కలంబు నా
సంతతతేజ మీభువనసంభవమందు వికార మొందునే!
కాంతిని నల్లగల్వల నగంగలమబ్బులచాలు పుట్టునో,
నింతయు నాకసంబు వహియించునె తాను వికారలేశముఁ!

పురు—సాధు! సాధు! ప్రజ్ఞావంతుఁడవయిన యీసీవిమర్శనము నాడెందము నానందపెట్టుచున్నది. (ఉపనిషద్దేవినిగూర్చి తదనంతరము ?)

ఉప—తదనంతరము వారందఱును మండిపడి, "ఓహో! విశ్వవిలయముచేత ముక్తి కలుగునని ప్రేలుచు, నాస్తికమార్గము నవలంబించుచున్న దీనినిబట్టి బంధింపవలెను" అని యందఱును ససంరంభముగా నన్ను నిగ్రహించుట కుద్యుక్తులైరి.

పురు—(భయముతో) ఆపయిని?

ఉప—ఆపైని నేను మిక్కిలి త్వరితముగాఁ బఱచి దండకారణ్యములోఁ బ్రవేశించితిని. అంతట మందరగిరికి సమీపమునఁ గట్టఁబడిన మధుసూదనాలయము చేరువను—

ఉ. బాహులకంకణావళులు భగ్నముచేసిరి రాల రత్నముల్;
ద్రోహమతిన్ శిరోమణుల దొంగిలఁ ద్రెంచిరి కేశపాశముల్;
దేహళిఁ దారహారములు త్రెంచి, హరించిరి కట్టుబట్టయున్;

పురు—తరువాత? తరువాత?

ఉప—అప్పుడు దేవాలయములోనుండి వెడలివచ్చి గదాపాణులైన పురుషులు వారి నతినిర్దయముగా మోదఁగా భీతులై యందఱును దిగంతములకుఁ బాఱిపోయిరి.

వివే—(హర్షముతో) పూజ్యురాల వయిన నిన్నతిక్రమించువారిని విశ్వసాక్షియైనభగవంతుఁడు క్షమింపఁడుగదా?

పురు—తరువాత? తరువాత?

ఉప—

దేహముఃతూల, వందియులు త్రెళ్ళఁగ, గీతగృహంబుచొచ్చితిన్. అక్కడ నాకూఁతురైన గీతాదేవి చేరవచ్చిననన్నుఁ జూచి, సంభ్రమముతో "అమ్మా! అమ్మా!" అని కౌఁగిలించుకొని కూరుచుండఁ బెట్టెను. అప్పుడామె నావృత్తాంతమును విని, "అమ్మా! నీవు మనస్సులో ఖేదమును బొందఁబోకు, ఏఖలులు నిన్నప్రామాణికురాలి

నిగాఁ జేసి యభీష్టముగా నాసురబుద్ధులయి చరింతురో వారి నీశ్వరుఁడే శిక్షించును. అట్టివారినిగూర్చి భగవంతుఁడు గీతలయందు—

"గీ. అట్టిక్రూరులఁ బాపుల నధమనరుల
ద్వేషయుక్తులఁ ద్రోయుదుఁ దీవ్రగతిని
సంతతము నేను సంసారసాగరముల
లోన నొక్కట నాసురయోనులందె."

అనెను.

పురు—(సకౌతుకముగా) దేవీ! ఆయీశ్వరుఁ డెవఁడో నీ యనుగ్రహమువలనఁ దెలిసికొనఁ గోరుచున్నాను.

ఉప—(గోపించినదానివలె) ఎవ్వఁడు తన్నుఁదాఁ దెలిసికోలేక యంధునివలెఁ బ్రత్యుత్తర మిచ్చుచున్నాఁడో యతఁడే.

పురు—(హర్షముతో) ఏమి! నేనే యాపరమేశ్వరుఁడనా?

ఉప—అవును.

గీ. పరుఁడు నీకంటెఁ గాఁ డల్లపరమపురుషుఁ;
డన్యుఁడవు గావు నీ వామహాత్మ్ముకంటె;
నన్యుఁగా మాయచేఁ దోఁచె దతనికంటె,
నంబువులయందు సూర్యబింబంబు పగిది.

పురు—(వివేకునితో) దేవా! ఈదేవి చెప్పినను, నేనీయర్థమును జక్కఁగా గ్రహింప లేకున్నాను.

క. భిన్నున్ సుశరీరావ
చ్ఛిన్ను జరామరణఖిన్నుఁ జెన్నుగ నన్నున్
సన్నుతిచేసెడు నీయమ,
యున్నన్నా! నిత్యసచ్చిదానందునిగన్,

వివే—పదార్థపరిజ్ఞానము లేకపోవుటవలన నీకీవాక్యార్థము బోధపడలేదు.

పురు—అది నాకు బోధపడుటకు మీరుపాయము సెలవియ్యవలెను.

వివే—ఇదిగో చెప్పుచున్నాను—

మ. కడు నీయందుఁ జిదాత్మముంగని, యహంకారుండఁ గానంచు నె
ప్పుడుఁ జిత్తంబు నడంచి, తత్త్వసమితిం బోకార్చి కావింతు వే
గ్గడకం దత్త్వమసీతి సంస్మరణ, కన్పటున్ భవోద్యత్తమం
బడఁగన్ శాంతము స్వప్రకాశ మగునిత్యజ్యోతి హార్దాత్మతన్.

పురు—(ఆనందముతో విన్నయర్థము నాలోచించుకొనుచున్నాఁడు)

[అప్పుడు నిదిధ్యాసనుఁడు ప్రవేశించుచున్నాఁడు]

నిది—"నాయభిప్రాయమును నీవు వివేకునితో నున్న యుపనిషద్దేవికి నిగూఢముగా బోధపఱుపవలయును, నీవు పురుషునిలోఁ బ్రవేశింపవలెను" అని భగవతియైన విష్ణుభక్తిదేవి నాకానతిచ్చినది. (చూచి) ఇదిగో దేవి వివేకపురుషులతోడఁ గూడి సమీపముననే యున్నది. ఆమె సన్నిధికిఁ బోయెదను. (చేరువకుఁబోయి యుపనిషద్దేవితో జనాంతికముగా) అమ్మా! "దేవతలు సంకల్పమాత్రసంభవులు. నీవు గర్భమును ధరించియున్న దానవని నేను యోగధ్యానముచేతఁ దెలిసికొన్నాను. క్రూరసత్త్వమైన విద్యయను కన్యకయుఁ బ్రబోధ చంద్రుఁడును నీగర్భమునందున్నారు. అందువిద్యను సంకర్షణవిద్యచేత మనసునందు సంక్రమింపఁజేసి, ప్రబోధచంద్రుని బురుషునికి సమర్పించి, నీవు వివేకునితోడఁగూడ నాయొద్దకు రావలసినది" అని విష్ణుభక్తిదేవి యాజ్ఞ యిచ్చినది.

ఉప— దేవి యాదేశించినట్లు చేసెదను. (అని వివేకునితోడ నిష్క్రమించుచున్నది)

నిది—(పురుషునిలోఁ బ్రవేశించుచున్నది)

పురు—(ధ్యానము నటించుచున్నాఁడు)

(నేపథ్యమునందు) ఆశ్చర్యము! ఆశ్చర్యము!

మ. ఉరుకాంతిచ్ఛటలన్ దిశావళుల విద్యుల్లీల వెల్గింపుచున్,
 ఖరదీప్తాస్థివిశాలమూ మనసువక్షంబుచ్చిపోఁ బుట్టి, త
 త్పరివారంబును మోహుని న్మెసవి, విద్యాకన్య తోడ్తోనగో
 చరమై పోయెఁ; బ్రబోధచంద్రుఁడును దా జన్మించె జీవు న్ఘనన్.

[అప్పుడు ప్రబోధచంద్రుఁడు ప్రవేశించుచున్నాఁడు]

ప్రబో—

ఉ. స్మ్యాతమొ, వ్యాప్తమో, మఱియుపోహితమో, యుపసారితంబో, సం
 భూతవిలాపితంబొ, హ్మృతమో, యనుతర్కములేక, యేని సం
 జాతముచేఁ బ్రపంచము వెసం జెడునో సహజప్రకాశలీ
 నాతతరూపమై యలమహాత్ముఁడ నేను బ్రబోధచంద్రుఁడన్.

(ముందుకు నడిచి) ఇతఁడె పురుషుఁడు. ఈతనిదాపునకుఁబోయెదను. (సమీపించి) దేవా! ప్రబోధచంద్రుఁడను నేనునమస్కారము చేయుచున్నాను.

పురు—(ఆహ్లాదముతో) వత్సా! రమ్ము. నన్ను గౌఁగిలించు కొమ్ము.

ప్రబో—(ఆలింగనము చేయుచున్నాఁడు)

పురు—(ఆనందముతో) సీహో! ఇప్పుడు విధూతతిమిరజాతమయి ప్రభాతము సంజాతమయినది!

చ. ఒకటఁ ప్రబోధచంద్రమహితోదయ మాటను జేసి యిట్యెడన్
ప్రకటవికల్పనిద్రయును ప్రస్ఫుటమోహతమంబుఁ బాయఁగాఁ,
జకచకనేన శ్రద్ధ మతి శాంతి వివేక శమంబుఁ లాదిగా
సకలజగన్మయుండయి యెసంగెడువిష్ణువుగా స్ఫురించెదన్.

సర్వవిధములచేతను నేను విష్ణుభక్తిదేవి ప్రసాదమువలనఁ గృతి కృత్యుఁడ నయినాఁడను. అట్టి నేనిప్పుడు—

చ. విడిచి సమస్తసంగములు, వేఁడక విశ్వములోని దేవియున్;
గడలనో మాలలందొ ఫలకాంతయొనర్పక సంచరించుచున్,
సుడివడుకోపమున్ భయము శోకము మోహము నుజ్జగించి, యి
ప్పుడె మునినైతి శాంతి భృంశముంగని, రాత్రియెనిల్పు తావుగన్

[అంతట విష్ణుభక్తిదేవి ప్రవేశించుచున్నది]

విష్ణు—(హర్షముతో సమీపించి) శమితారాతివై యున్న నిన్నిప్పుడు చూచుచున్నానుగాన, చిరకాలమునకుఁగదా నామనోరథము లన్నియు సంపూర్ణములయినవి.

పురు—దేవిగారిప్రసాదమున్నప్పుడు దుష్కర మేదియుండును?

(అని పాదములమీఁదఁ బడుచున్నాఁడు)

విష్ణు—(పురుషుని లేవనెత్తుచు) వత్సా! లెమ్ము. ఇంకను నేను నీ కేమి ప్రియము చేయుదును?

పురు—ఇంతకంటె నాకుఁ బ్రియ మేమున్నది?

క. కృతకృత్యుం డయ్యెను దా
హతవిమతస్తోముఁ డగుచు నల్లవివేకుం;
డతిడళితరజస్కుఁడ నై
యతులసదానందపథ.. నందితి నేనున్.

అయినను దా నీభరతవాక్యము సిద్ధించునుగాక!

చ. ఇలపయి నిష్టవృష్టిఁ గురియించును గావుత మేఘుఁ డెంతయున్!
గలుముల రాజు లేలుదురుగాక మహి న్నిరుపద్రవంబుగన్!
వెలి తెలివిం దమంబడఁచి, భీమ మతా విషయోగ్రపంక మై
కలఁచు భవాబ్ధి దాఁటుదురుగాక మహాత్ములు నీదుసత్కృపన్!

సంపూర్ణము.

బాక్సు ప్రెస్, రాజమహేంద్రవరం—1950.

వినీసువర్తకచరిత్రము.

గ్రంథకర్త:
కందుకూరి వీరేశలింగము పంతులు

ఐదవకూర్పు

ప్రకాశకులు:
హితకారిణీసమాజము
రాజమహేంద్రవరము
1950

రాజమహేంద్రవరమున
బాక్సుముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడియె.

వినీసువర్తకచరిత్రము.

ప్రథమాంకము

౧. రంగము—వినీసుపురములో నొకవీధి.

[అంటోనియో, శాలారినో, సోలానియో, ప్రవేశించుచున్నారు.]

అంటో—ఏనేలనిజముగా నిటువ్యసనంబు
గా నున్నవాఁడనో కానియెఱుంగ;
ఏమియుఁ దోఁచదు నామదికిపుడు
నీమది యదిచూచి నగులొందెదనేదు;
మదిచింతకుఁ గతంబు మఱియేదిగలదొ
యదివచ్చి నన్నేల యాశ్రయించినదొ,
చింత యనఁగ నేమొ, చింత యెద్దాన
నింతగఁబుట్టెనో, యెఱుఁగంగవలయు.
నను నేనెఱుంగుట కనువుగానంత
చెనఁటివానిని జేసెఁ జింత నన్నిపుడు.

శాలా—నీచిత్తమంతయు నీరధిమీఁది
కే చని చాంచల్య మొనసెడుఁ జూడ
అచ్చట నీయోడ లతిశయం బగుచు
ముచ్చట యాచాప మొత్తంబుతోడఁ
బ్రభురత్నము లలిమేలివణిజులఁ బో
(ప్రభగల జలధిదేవతలను బోలి),
తమతమ తెరచాఁగములను దాల్చి

యమితనమ్రత దోఁప నాత్రోవఁబట్టి
చిన్నయోడలచాలు చేరువనుండి
క్రన్ననఁ జనునెడఁ గాంచి యవ్వాని
గారవించుచు క్షేమకరయాత్ర చేయు
వారిధిలో నెల్లవానిని మించి.

శోలా——విలువవస్తువు లట్టివింతవినావి
జలనిధిమీఁద దవ్వుల నుండెనేని,
మనసెల్ల వానిమీఁదనె యుండు నాకు
ఘనతర ప్రేమంబుకతమున నెపుడు;
గాలి యేవంకకుఁ గదలునో చూడ
గాలిలోఁ బట్టుదు గడ్డిపోఁ చెవుడు;
దేశపంటంబులఁ దెరువులు రేవు
లాశమై వంతెన లరయుచు నుందు;
చొరవచేఁ బంపిన సరకులకింత
దురదృష్టకర మని తోఁచెడునట్టి
ప్రతినిమిత్తముఁ జూచి వ్యసనాతిశయత
మతిచెడి యుండుదు మఱి తప్పకుండ.

శాలా——వాడుకగాఁ గాఁచు పలచని పులుసు
వేఁడి చల్లారంగ విసరెడు నపుడు,
అతిమాత్ర మగుగాలి యంబుధిమీఁద
మితిలేనినష్టంబు జతకూర్పఁ దగుట
తలపునఁ బాఱుచుఁ గలుగును నాకు
చలిజ్వర మొదవిన చాడ్పునఁ గుదుపు
ఇసుక బల్ గడియార మీక్షించునప్పు

డిసుకతిన్నెలు మిట్ట లెదకుఁ గాన్పించు;
దానఁ 'నాంద్రూ' యనఁ దనరు నాయోడ
జానగు వెలహెచ్చు సరకులతోఁడ
మిట్టఁ బట్టుచు నేల మీఁదికి నొఱగి
యెట్టలో యద్దాని యెత్తయిన శిరసు
పుడమిని ముద్దాడువడుపున నోడ
కడుపునకన్నను గడుక్రింద వ్రాలి
పసచెడి యిసుకలోఁ బాఁతుకొన్నట్టు
పొసఁగ నామదికిని బొడకట్టు సుమ్ము:
దేవాలయముఁ జేరి దివ్యమండపము
పావనతరశిలాభాగంబుఁ గన్న,
స్మరణకు భీకరాచలములు వచ్చి
గిరి తాఁకి నాయోడ సరగునఁ బగిలి
దానిలోఁగల సుగంధ ద్రవ్యసమితి
యానీరనిధినిండ నలమినయట్లు,
వాసికెక్కిన పట్టువస్త్రముల్ జలధిఁ
గైసేసి నట్టును గాన్పించు మదికి
వేయేల? పోరాదె వెలగట్ట రాని
యాయోడ క్షణములో వ్యర్థంబుగాను?
ఇట్టితలంపులు హృదయంబునందుఁ
బుట్టకుండునె నాకు? పుట్టినయపుడు
తలఁపునఁ బాఱదె దైవవంచనము
కలిగినతటిఁ జింతె గదురు నటంటు?
'అంటోనియో' యొక్క వ్యసనకారణము

కంటిని జెప్పనక్కఱలేదు నాకు—
అతనికి వాణిజ్యమందున మిగుల
మతిపోయి చింతచే మఱుఁగుచున్నాఁడు.

ఆంటో—కాదు కారణ మది గట్టిగా నమ్ము;
నాదువ్యాపారంబు నమ్మియంతయును
నొక్కయోడనె కాని యొకచోనె కాని
చిక్కపడంగ నుంచినవాఁడఁగాను.
నాభాగ్యమును నెల్ల నమ్మి యీయేటి
లాభంబుమీఁదనె లలి నుంచలేదు.
కావున వాణిజ్యకర్మంబుఁబట్టి
నే విచారం పడ నావంత యైన.

శాలా—అటులైన నీవు కామాగ్ని చేనొక్క
కుటిల కుంతలికయి కుందు చున్నావు.

ఆంటో—నే నేమియు నెఱుంగ; నిందగట్టకుము.

శాలా—మానినిమీఁదిప్రేమయు లేదెనీకు!
అటు లయ్యెనేని మేమనవచ్చు నిన్నుఁ
దటుకున మోదంబు తగ్గినందుననె
వ్యసనంబు పడుచున్న వాఁడవంచిపుడు;
వసుధ నవ్వుచుఁ గ్రుళ్ళి వ్యసనంబులేమి
నానంద మొందితి ననికూడ సులభ
మైనట్టిహేతు వీ వమరింప వచ్చు.
ఇలమీఁద సృజియించె నిపుడు దైవంబు,
చెలఁగి రెండుతలల జేనసు తోడు,
ఛాలవింతలు గొల్పు జనశిఖామణులఁ